బుధవారం
02-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 130
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పళ్లు-పెదవుల్లా కలిసుంటాం...

చైనా, వియత్నాం దేశాలు, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజలు ఎల్లప్పుడు పళ్లు, పెదవుల్లా కలిసిమెలిసి ఉంటారని సీపీసీ, సీవీసీ ప్రధాన కార్యదర్శులు జిన్‌పింగ్, న్యుయన్ ఫు ట్రోంగ్ అన్నారు. 2లో

క్వారీల తవ్వకాలకు
హద్దుల్లేవ్!

ఆవగింజంత అనుమతితో కొండలను కొల్లగొడుతున్న లీజుదారులు

- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- బ్లాస్టింగ్ ధాటికి ఇళ్లు బీటలువారుతున్నాయని గ్రామస్తుల గగ్గోలు
- కాలపరిమితి మించినా యథేచ్ఛగా నల్లరాయి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల్లో నిబంధనలకు పాతరేసి నల్లరాతి క్వారీలను లీజుదారులు కొల్లగొడుతున్నారు. ఆవగింజంత అనుమతి తీసుకుని కొండలను పిండి చేస్తున్నారు. హద్దులు దాటి మరీ నల్లరాయిని గుల్ల చేస్తున్నా అధికారులు మామూళ్లమత్తులో జోగుతూ అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. రిగ్ బ్లాస్టింగ్ ధాటికి ఇళ్లు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. కాలపరిమితి మించినా రాజకీయ నాయకుల అండతో కొండను పిండి చేసి సామర్థ్యానికి మించి టిప్పర్లకు లోడ్‌చేసి దోచుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు బరితెగించి తవ్వుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వాదాయానికి గండికొడుతున్న కేటుగాళ్లపై ప్రభుత్వం ఏమేరకు చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి. 2లో

క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ క్యానెల్‌తో నారాయణ

నారాయణకు వేధింపులు

- మియామి విమానాశ్రయంలో నిలిపివేత
- మూడు గంటల విచారణ

విజయవాడ: క్యూబాలో జరిగిన 'అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మికుల సదస్సు'కు హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణను మియామి విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు వేధింపులకు గురిచేశారు. సదస్సు అనంతరం హవానా నుంచి పెరూ వెళుతుండగా మధ్యలో ఆ ఘటన చోటుచేసుకుంది. విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు విచారణ పేరుతో అదుపులోకి తీసుకున్నారు. పెరూలో గల తన మనవడిని చూడటానికి నారాయణ వెళుతున్నారు. మూడు గంటలకు పైగా వివిధ ప్రశ్నలతో నారాయణను అధికారులు వేధించారు. దీంతో పెరూకు వెళ్లే విమానం మిస్సయింది. ఆరు గంటలకు పైగా మరో విమానం కోసం ఆయన ఎదురుచూడాల్సి వచ్చింది. విచారణ అనంతరం పెరూ వెళ్లడానికి అధికారులు అనుమతించారు. ఈ ఘటనపై నారాయణ వీడియో ద్వారా తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

క్యూబా అంటే అమెరికాకు ఉలుకు

అక్టోబరు 26-29 తేదీల్లో 22వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం క్యూబా రాజధాని హవానాలోజరిగింది. ఆ సమావేశానికి సీపీఐ నుండి నేను హాజరయ్యాను. సమావేశాలనంతరం హవానా నుండి పెరూ(దక్షిణ అమెరికా)కు ఫ్లోరిడా మీదుగా వెళ్లాలి. అయితే ఫ్లోరిడాలో ఇమ్మిగ్రేషన్ తనిఖీ ఉంటుంది. ఆ సందర్భం ఓ అధికారి నా పాస్‌పోర్ట్ చూడగనే నన్ను సెక్యూరిటీకి అప్పగించారు. నన్ను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి ఫోన్ తీసుకున్నారు. గంటతర్వాత మరో అధికారి వచ్చి నా పూర్వాపరాలు అడిగారు. దీనికి ముందు నా ఫోన్‌లో అంశాలన్నీ పరిశీలించినట్టు అర్థమైంది. మీరు కమ్యూనిస్టులు...హవానా సభలో మీరు, ఆ దేశ అధ్యక్షుడు, కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిని కలిసినట్టు ఫొటో చెబుతుంది. మీరు వారితో ఏమి మాట్లాడారో

- మిగతా 2 లో

అమరావతి కేసులో...
విచారణ నుంచి సీజేఐ విరమణ

న్యూఢిల్లీ: అమరావతి రాజధాని పిటిషన్లపై విచారణ వేరే ధర్మాసనానికి బదిలీ కానుంది. అమరావతి కేసు విచారణ నుంచి సీజేఐ జస్టిస్ యూయూ లలిత్ వైదొలిగారు. 'నాట్ బిఫోర్ మి' అని లలిత్ స్పష్టం చేశారు. కేసు విచారణ ప్రారంభమైన వెంటనే గతంలో విభజనచట్టం, సీఆర్‌డీఏ చట్టాలపై సీజేఐ లలిత్ తన అభిప్రాయాన్ని అందజేసిన విషయాన్ని అమరావతి రైతుల తరపు న్యాయవాది ఆర్యమ సుందరం ఆయన దృష్టికి తెచ్చారు. న్యాయమూర్తిగా ఏపీ కేసుల విచారణ నుంచి తప్పుకున్న విషయాన్ని కూడా సీజేఐ లలిత్ దృష్టికి అమరావతి తరపు న్యాయవాదులు తీసుకొచ్చారు. దీనికి స్పందించిన సీజేఐ లలిత్ 'అవునా...ఆ విషయం నాకు తెలియదే... ఏ అభిప్రాయం ఇచ్చానో చెప్పగలరా' అని న్యాయవాది ఆర్యమ సుందరాన్ని అడిగారు. దానికి సంబంధించిన లేఖను సీజేఐకి న్యాయవాది అందజేశారు. 'మంచి పనిచేశారు....అమరావతిపై అభిప్రాయం ఇచ్చానన్న విషయం నాకు తెలియదు. మీరు నా దృష్టికి తెచ్చి మంచి పనిచేశారు' అని వెంటనే ఈ కేసు నుంచి తప్పుకుంటున్నట్టు లలిత్

- మిగతా 2 లో



హైకోర్టులో ప్రభుత్వానికి షాక్

- అమరావతి పాదయాత్ర యథాతథం
- రైతులకు ఐడీ కార్డులు జారీచేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రైతుల పాదయాత్రను నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. దీంతో ప్రభుత్వానికి మరోసారి హైకోర్టు నుంచి ఎదురు దెబ్బ తగిలింది. అమరావతి పాదయాత్రను యథాతథంగా కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. పాదయాత్రలో 600 మంది రైతులు పాల్గొనవచ్చని ఆదేశాలిచ్చింది. ఐడీ కార్డులు ఉన్నవారు మాత్రమే పాదయాత్రలో పాల్గొనాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఐడీ కార్డులు రైతులకు వెంటనే ఇవ్వాలని పోలీసు అధికారులను హైకోర్టు ఆదేశించింది. సంఘీభావం తెలిపే వారు రోడ్డుకు రెండు వైపులా ఉండాల్సిందేనని గతంలో ఇచ్చిన ఉత్తర్వులకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. పాదయాత్ర ప్రారంభించుకోవచ్చని, సంఘీభావాన్ని ఏ రూపంలోనైనా తెలపవచ్చని న్యాయస్థానం సూచించింది. గతంలో కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉండాలని తాజాగా హైకోర్టు మరోసారి ఉత్తర్వులిచ్చింది.

త్వరలో మహాపాదయాత్ర: శివారెడ్డి

త్వరలో అమరావతి మహా పాదయాత్రను పున:ప్రారంభిస్తామని అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ శివారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహా పాదయాత్రను

నిలుపుదల చేసిన రామచంద్రాపురం నుంచే త్వరలోనే యాత్ర కొనసాగుతుందన్నారు. రైతులతో, సమన్వయ కమిటీలతో సమావేశం నిర్వహించి ప్రారంభ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వానికి కోర్టు తీర్పు ద్వారా ఇప్పటికైనా బుద్ధి రావాలని, పాదయాత్రకు అడ్డంకులు సృష్టించకూడదని హితవు పలికారు. పాదయాత్ర దివ్యరథానికి అమర్చిన సీసీ కెమేరాలను పోలీసులు తీసుకెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కోర్టు నిబంధనలకు విరుద్ధంగా సీసీ కెమేరాలు తీసుకెళ్లిన పోలీసుల పై ప్రైవేట్ కేసులు వేస్తామన్నారు. రాష్ట్రానికి ఒకే రాజధాని విశాఖ అంటూ మంత్రి ధర్మాన చేసిన వ్యాఖ్యల పై రాయలసీమ వైసీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ది వైర్ ఎడిటర్ల
ఇళ్లలో సోదాలు

న్యూఢిల్లీ: ది వైర్ వార్తాసంస్థ కార్యాలయం, నలుగురు సంపాదకులు సిదార్థ వరదరాజన్, ఎంకే వేణు, సిదార్థ భాటియా, జాహ్నవి సేన్ ఇళ్లలో దిల్లీ పోలీసులు సోమవారం సోదాలు నిర్వహించారు. ది వైర్-హెడ్ ఆఫ్ ప్రాడక్ట్ మిథున్ కిదంబీ ఇంట్లోనూ తనిఖీలు జరిగాయి. మోసం, ఫోర్జరీ, పరువు నష్టం, నేరపూరిత కుట్ర నెపంతో బీజేపీ సోషల్ మీడియా చీఫ్ అమిత్ మాళవియా ఫిర్యాదు క్రమంలో ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగాయి. సోమవారం సాయంత్రం 4.40 గంటల నుంచి 6 గంటల వరకు దిల్లీ పోలీసు క్రైంబ్రాంచ్ అధికారులు తనిఖీలు జరిపినట్లు 'ది స్క్రోల్.ఇన్'తో మాట్లాడిన వేణు తెలిపారు. తన ఐఫోన్, ఐపాడ్‌ను క్లోనింగ్ కోసం అధికారులు తీసుకెళ్లారని చెప్పారు. వరదరాజన్, సేన్ ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు జరుగగా భాటియా ఇంట్లో రాత్రి 7.30 గంటలకు తనిఖీలు నిర్వహించారు. మా పరికరాలను ఇచ్చి పాస్‌వర్డ్‌లను అధికారులకు తెలిపినట్లు వరదరాజన్ తెలిపారు. తన మాక్‌బుక్, రెండు ఐఫోన్లు,

- మిగతా 2 లో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు
వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం

- సాహిత్యంలో సుదీర్ఘకాల సేవలు
- ముద్రణారంగంలో ఎనలేని కృషి సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాహిత్యరంగంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ విశేష సేవలందిస్తూ సుదీర్ఘకాలం నుంచి సామాజిక, అభ్యుదయ భావజాల రంగాల్లో ప్రచురణలను ముద్రిస్తూ ఎంతో ఆదరణ పొందుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసించారు. వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు పొందిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు, యాజమాన్యానికి సీఎం అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్-2022 అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి

- మిగతా 2 లో

వైఎస్ఆర్ సేవలు అపూర్వం 8 లో

ఇదీ లోకం!

మోదీ... కేసీఆర్ జోడీనే

- ఎన్నికల ముందు ఇద్దరూ డ్రామా చేస్తారు
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇద్దరూ జోడీనే అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ, టీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, ఎన్నికల ముందు ఇద్దరూ కలిసి డ్రామా చేస్తారని చెప్పారు. ఎప్పుడేమి చేయాలో కేసీఆర్‌కు మోదీ సూచిస్తారని అన్నారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ కూడా నిరుద్యోగం గురించి ఊసెత్తరని ఎద్దేవా చేశారు. భారత్ జోడో యాత్రలో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన సభలో రాహుల్ ప్రసంగించారు. పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టిన బిల్లులకు టీఆర్‌ఎస్ మద్దతిస్తోందని, ప్రతిపక్షం లేవనెత్తే అంశాలకు మాత్రం మద్దతు ఇవ్వడం లేదని రాహుల్ ఆరోపించారు. హైదరాబాద్ విమానాశ్రయం అందరూ చూస్తుండగానే మోదీ స్నేహితులైన వ్యాపారవేత్తలు అతి త్వరలోనే స్వాధీనం చేసుకుంటారని రాహుల్ ఆరోపించారు. పోర్టులు, విమానాశ్రయాలను, ఎల్ఐసీని కేంద్రం అమ్మేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థల యజమానులు లక్షలు, కోట్ల రూపాయలు

- మిగతా 2 లో

తక్షణమే సమగ్ర విచారణ

- ఏ అంశాన్ని-కోణాన్ని వదలొద్దు
- లోతైన దర్యాప్తు జరగాలి
- మోర్బీ ఘటనపై ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోదీ

మోర్బీ: గుజరాత్ మోర్బీలో తీగల వంతెన కూలిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణను తక్షణమే జరపాలని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఉన్నత స్థాయి సమీక్షలో రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయ- సహకారాలు అందించాలని స్పష్టంచేశారు. ఘటనా స్థలంలో చేపట్టిన సహాయక చర్యలు తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పంకజ్ కుమార్, గుజరాత్ డీజీపీ ఆశీష్ భాటియా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మోదీ అంతకుముందు ఘటనా స్థలాన్ని భూపేంద్ర పటేల్‌తో కలిసి సందర్శించారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. దాదాపు 15 నిమిషాలు ఆసుపత్రిలో గడిపిన మోదీ... ఆరుగురు బాధితులను

- మిగతా 2 లో

తమిళుల సమస్యలు పరిష్కరిస్తాం : విక్రమసింఘె

కొలంబో: తమిళుల సమస్యలను పరిష్కరించగలమన్న ఆశాభావాన్ని శ్రీలంక దేశాధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె వ్యక్తంచేశారు. చెట్ల పెంపక రంగంలోని భారతీయ సంతతి కార్మికులు సమాజంలో మమేకం చేసే మార్గాలను అన్వేషించేందుకు కమిటీని నియమించినట్లు ప్రకటించారు. భారత సంతతి తమిళులకు ప్రాతినిధ్యం వహించే లంక దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీ సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ (సీడబ్ల్యూసీ) విజ్ఞప్తి మేరకు పుదుచ్చేరి ఆపన్నహస్తం అందించిందని, తమ దేశానికి ఔషధాలను పంపిందని విక్రమసింఘె వెల్లడించారు. తమిళుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్లు చెబుతూ భారత్, శ్రీలంక మధ్య సిరిమల్‌వట్టె-శాస్త్రీ ఒప్పందాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇది 1964, అక్టోబరు 30న జరిగింది.

పళ్లు-పెదవుల్లా కలిసుంటాం...

- ఆత్మీయత చాటిన వియత్నాం-చైనా కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కార్యదర్శులు
- సీపీసీ చీఫ్‌కు న్యుయన్ ఫు ట్రోంగ్‌కు చైనా స్నేహ పతకంతో జిన్‌పింగ్ సన్మానం



బీజింగ్: చైనా, వియత్నాం దేశాలు, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజలు ఎల్లప్పుడు పళ్లు, పెదవుల్లా కలిసిమెలిసి ఉంటారని సీపీసీ, సీవీసీ ప్రధాన కార్యదర్శులు జిన్‌పింగ్, న్యుయన్ ఫు ట్రోంగ్ అన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి న్యుయన్ ఫు ట్రోంగ్‌కు పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా స్నేహ పతకం (ఫ్రెండ్‌షిప్ మెడల్)తో చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సన్మానించారు. ఈ వేడుక బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరిగింది. సీపీసీ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చైనా కౌన్సిలర్, విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఈ అవార్డు ఆర్డర్‌ను చదవి వినిపించారు. పక్కా మార్క్సిస్టు, మిత్రుడు, సీపీసీకి ఆప్తుడు అని ట్రోంగ్ గురించి జిన్‌పింగ్ అన్నారు. ఆయనను ప్రతిష్ఠాత్మక ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో సత్కరించారు. ట్రోంగ్‌తో పాటు వియత్నాం ప్రజల పట్ల సీపీసీకి చైనా ప్రజలకు ఉన్న స్నేహభావాలకు ఈ పతకం ప్రతీకని జిన్‌పింగ్ తెలిపారు. చైనా, వియత్నాం 'కామ్రేడ్లు-సోదరులు' అని అన్నారు. రెండు పార్టీలు, దేశాల ప్రజల ఉజ్వల-మెరుగైన భవిష్యత్ దిశగా కలిసి సాగుతామన్నారు. చైనా, వియత్నాం ఇరుగు-పొరుగు మిత్రదేశాలని, గిరులు, నదులతో 'పళ్లు-పెదవులు' వలె కలిసి ఉంటాయని జిన్‌పింగ్ వర్ణించారు. రెండు దేశాలు భావసారూప్యతతో ఉన్నాయని, శాంతి, మానవాళి పురోగతికి పరస్పర భాగస్వామ్యం ఉన్నదని, సోషలిస్టు ఆధునీకీకరణకు దిశగా సీపీవీతో కలిసి పని చేసేందుకు సీపీసీ సానుకూలంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు. మావో జెడాంగ్, హో చిన్ మిన్ ద్వారా ఏర్పడిన సంప్రదాయ మైత్రిని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళతామన్నారు. రెండు దేశాలు గొప్ప అభివృద్ధిని సాధిస్తాయని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. అనంతరం ట్రోంగ్ మాట్లాడుతూ, తనను ప్రతిష్ఠాత్మక అవార్డుతో సన్మానించినందుకు జిన్‌పింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీపీసీ, చైనా ప్రభుత్వం, ప్రజల మిత్రభావాలను సీపీవీ, వియత్నాం ప్రభుత్వం-ప్రజలు సంపూర్ణంగా ప్రతిబింబిస్తారన్నారు. వియత్నాం-చైనా సుదీర్ఘ మైత్రి గొప్ప స్ఫూర్తి అని అన్నారు. ఈ గౌరవాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. సోషలిస్టు పథంలో సాగేందుకు వియత్నాం ప్రజలతో కలిసి కృషిచేస్తానని హామీనిచ్చారు. వియత్నాం, చైనా మైత్రిని మరింతగా పెంపొందించేందుకు కట్టుబడి ఉంటానన్నారు. జిన్‌పింగ్ చెప్పినట్లుగా తమ రెండు దేశాలు 'కామ్రేడ్‌లు-సోదరులు' అని అన్నారు. ఉజ్వల భవితవ్యానికి కలిసి బాటలు వేసుకుంటాయనిని ట్రోంగ్ అన్నారు. రెండు దేశాల మిత్రబంధం చిరకాలం ఉంటుందని; వియత్నాం-చైనా సంబంధాలు తరతరాల అంతర్జాతీయ సంబంధాలకు నమూనాగా నిలుస్తుందని ఆకాంక్షించారు. అవార్డు ప్రదానం అనంతరం జిన్‌పింగ్, ట్రోంగ్ తేనీటి విందులో పాల్గొని సంప్రదాయ మైత్రి, అభివృద్ధికి అవకాశాల గురించి మాట్లాడుకున్నారు.

మా జోలికొచ్చారో...

అమెరికాకు ఉత్తర కొరియా హెచ్చరిక

సియోల్: అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా 200 యుద్ధ విమానాలతో సైనిక విన్యాసాలు నిర్వహించడంపై ఉత్తర కొరియా ఘాటుగా స్పందించింది. ఇది దండయాత్రకు యత్నంగా భావిస్తున్నట్లు పేర్కొంది. తమ జోలికి వస్తే దీటైన బదులిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో అమెరికాను హెచ్చరించింది. అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలు ఉత్తరకొరియా వ్యూహాత్మక లక్ష్యాలపై దాడికి సంకేతాలుగా తోస్తున్నట్లు ఉత్తర కొరియా ప్రకటన పేర్కొంది. తమ దేశ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు తలపెడితే తీవ్రస్థాయిలో ప్రతిచర్యలు ఉంటాయని అగ్రరాజ్యాన్ని హెచ్చరించింది. కాగా, అమెరికా, దక్షిణ కొరియా వైమానిక విన్యాసాల్లో 200కుపైగా యుద్ధవిమానాలు, అత్యాధునిక ఎఫ్-35ఫైటర్ జెట్లు పాల్గొన్నాయి. ఉత్తర కొరియా ఆయుధాలను పెంచుకుంటుండటం, ఈ దేశం నుంచి అణ్వాయుధ ముప్పు పెరుగుతుండటంతో అమెరికా, దక్షిణ కొరియా తమ రక్షణవ్యవస్థను బలపర్చుకుంటున్నాయి. ఉత్తర కొరియా ఈ ఏడాది రికార్డుస్థాయిలో ఆయుధాలను ప్రదర్శించింది. 40కుపైగా బాలిస్టిక్ మిస్సైళ్లు ప్రయోగించింది.

చైనా 'మెంగ్టియన్' ప్రయోగం విజయవంతం

బీజింగ్: తమ అంతరిక్ష కేంద్రం నిర్మాణాన్ని చైనా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండవ ల్యాబ్ మాడ్యూల్ 'మెంగ్టియన్'ను విజయవంతంగా ప్రయోగించింది. చైనాలోని అతిపెద్ద రాకెట్లలో ఒకటైన లాంగ్‌మార్చ్-5బీవై4 ద్వారా మెంగ్టియన్ ల్యాబ్ మాడ్యూల్‌ను హైనన్ ప్రావిన్స్‌లోని వెంగ్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్ సైట్ నుంచి సోమవారం విజయవంతంగా ప్రయోగించినట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. ఈ ప్రయోగాన్ని వార్తాఛానళ్లు ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ప్రయోగం జరిగిన పది నిమిషాల తర్వాత నిర్దేశితకక్ష్యలోకి అంతరిక్ష నౌక చేరుకున్నదని, ప్రయోగం విజయవంతం అయిందని చైనా మానవసహిత అంతరిక్ష సంస్థ అధికారి ప్రకటించారు. మైక్రోగ్రావిటీ, ఫ్లూయిడ్ ఫిజిక్స్, మెటీరియల్స్ సైన్స్, కంబషన్ సైన్స్, ఫండమెంటల్ ఫిజిక్స్‌లో ప్రయోగాలు, అధ్యయనాలను ఈ ల్యాబ్ మాడ్యూల్ చేపడుతుందని జిన్హువా వెల్లడించింది. చైనా అంతరిక్ష కేంద్రం నిర్మాణం ఈ ఏడాదికి పూర్తి కానున్నట్లు సమాచారం.

నారాయణకు వేధింపులు

(మొదటిపేజీ తరువాయి)

వివరాలు చెప్పమని అడిగారు. మా మధ్య పార్టీ అనుబంధాలు తప్ప ఇంకేమీ ఉండవు. మర్యాదపూర్వకంగా కలిసి సెల్ఫీలు తీసుకున్నాం. వారు కూడా కామ్రేడ్లీగా ఆత్మీయతను వ్యక్తపరుస్తూ ఫొటోలు తీసుకున్నామని చెప్పాను. అయినా మీ మధ్య ఎలాంటి చర్చ జరిగింది? అంటూ అధికారి పదేపదే ప్రశ్నించారు. సహజంగా నాకు కూడా విసుగొచ్చింది. నేనేమీ టెర్రరిస్టును కాదు...చట్టబద్ధంగా 50 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్నాను. క్యూబా కమ్యూనిస్టు పార్టీ కూడా చట్టబద్ధంగానే పనిచేస్తుందిగా...అంతా పారదర్శకమే కదా... మరి మీ అనుమానాలేమిటి? అని ఎదురు ప్రశ్నించారు. మాకు కూడా తెలుసు. నేను కూడా క్యూబా జాతీయుడనే. అయితే కమ్యూనిజమంటే పడదన్నారు. అందుకేనా నన్ను విచారించిందని అడిగాను. మా బాస్‌తో కూడా మాట్లాడుతావా అంటూ మరో అధికారిని చూపించారు. ఎవరితో మాట్లాడాల్సిన అవసరం నాకు లేదని అంటుండగానే...ఆయన నేను కూడా క్యూబావాసినే అని చెప్పారు. అనవసరంగా మూడు గంటలు నన్ను ఆపి... నా విమానం అందుకోకుండా చేశారు... ఇప్పుడు నా ప్రయాణం సంగతేమిటని అడిగాను. దీనికి అధికారులు స్పందిస్తూ మీ లగేజీ భద్రంగానే వుంది. మరో విమానానికి టికెట్ తీసి ఇస్తామన్నారు. దాదాపు ఆరు గంటలు ఫ్లోరిడా విమానాశ్రయంలో కాలం గడుపాల్సి వచ్చింది. కూతవేటు(90 మైళ్లు) దూరంలో ఉన్న క్యూబా అంటే అమెరికాకు భయమా లేక ఈర్ష్య అని నారాయణ అనుమానం వ్యక్తంచేశారు. భారతదేశంలోనే కాకుండా అమెరికాలోనూ పోలీసు విచారణకు గురికావడం గర్వకారణమే కదా! అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రశాంతంగా పెరూ చేరుకున్నట్లు తెలిపారు.

విచారణ నుంచి సీజేఐ విరమణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. 'మీరు(సీజేఐ లలిత్) విచారించినా తమకేమీ అభ్యంతరం లేదు' అని అమరావతి తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. విభజన చట్టం, సీఆర్‌డీఏ చట్టాలపై ఇచ్చిన అభిప్రాయాన్ని సదుద్దేశంతోనే తమ దృష్టికి తీసుకు వచ్చామని న్యాయవాదులు సీజేఐకి తెలిపారు. సీజేఐ విచారించినా అభ్యంతరం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ కేసు విచారించేందుకు సీజేఐ విముఖత వ్యక్తం చేశారు. తాను సభ్యుడిగా లేని ధర్మాసనానికి కేసును పంపాలని రిజిస్ట్రీకి సీజేఐ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి తేదీని ప్రకటించాలని అమరావతి తరపు న్యాయవాదులు కోరారు. వీలును బట్టి రిజిస్ట్రీ తేదీని ఖరారు చేస్తుందని సీజేఐ లలిత్ వెల్లడించారు.

మోదీ... కేసీఆర్ జోడీనే

(మొదటిపేజీ తరువాయి)

రుణం తీసుకోగలుగుతారని, చిరు వ్యాపారులు మాత్రం చిన్న రుణాలు కూడా పొందలేకపోతున్నారని రాహుల్ అన్నారు.

హైదరాబాద్‌లో రాహుల్ యాత్రకు ఘనస్వాగతం

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణ రాష్ట్రంలో ఏడవరోజు కొనసాగింది. మంగళవారం ఉదయం శంషాబాద్ నుంచి ప్రారంభమైన యాత్ర హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా శంషాబాద్ వద్ద యువత రాహుల్‌కి ఘన స్వాగతం పలికారు. ఆయన వారితో మాట్లాడుతూ వారి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి భరతనాట్యం చేయగా, మరి కొంతమంది యువత జిమ్నాస్టిక్స్ చేసి చూపించారు. రాహుల్ యువత చేసిన విన్యాసాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆరంగర్ చేరుకున్న యాత్ర అక్కడి నుంచి పురానాపూల్ మీదుగా చార్మినార్‌కు చేరుకుంది. అనంతరం గాంధీభవన్, నాంపల్లి మీదుగా యాత్ర నెక్లెస్ రోడ్ వరకు సాగింది. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక స్తంభంపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దారి మధ్యలో రాహుల్ అనేక చోట్ల చిన్నారులను ఆత్మీయంగా పలకరిస్తూ వారితో ఫొటోలు దిగారు. భారత్ జోడో యాత్ర ముగింపు అనంతరం బోయిన్‌పల్లిలోని గాంధీయన్ ఐడియాలజీ సెంటర్‌లో ఆయన బస చేశారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొనేందుకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు, నగరవాసులు తరలివచ్చారు. బోనాలు, శివభక్తులు, పోతరాజుల వంటి సాంస్కృతిక కళాబృందాలతో కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. సదర్ దున్నపోతులను అఫ్జల్ గంజ్ వద్ద రాహుల్‌కు చూపించి సదర్ ఉత్సవాలను గురించి కాంగ్రెస్ నాయకులు వివరించారు. భారత్ జోడో యాత్రలో మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్, నిరంజన్, షబ్బీర్ అలీ తదితరులు ఉన్నారు.

ది వైర్ ఎడిటర్ల ఇళ్లలో సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

ఐపాడ్‌ను వారు తీసుకెళ్లారన్నారు. తమ పరికరాల నుంచి కేసును సంబంధించిన సమాచారాన్ని మాత్రమే సేకరించాలని సూచించేందుకు దిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసుల కార్యాలయానికి సంపాదకుల తరపు న్యాయవాది వెళ్లినట్లు వేణు వెల్లడించారు. 20 మందికిపైగా అధికారులు రాత్రి 9.45 గంటల తర్వాత తన ఇంటికి వచ్చి తనిఖీలు నిర్వహించారని, ఐమాక్‌లు, ఆఫీసులో పాస్‌వర్డ్స్, ఇతర పరికరాలను తీసుకెళ్లారని ది వైర్ సిబ్బంది తెలిపారు. సోమవారం నలుగురు ఎడిటర్లకు నోటీసులు జారీ చేశామని, దర్యాప్తు చేపట్టలేదని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, తగు చర్యలను తీసుకుంటామని దిల్లీ పోలీసు అధికారులు వెల్లడించారు.

క్వారీల తవ్వకాలకు హద్దుల్లేవ్!

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల్లో నల్లరాతి క్వారీలను పిండి చేసేస్తున్నారు. ఆవగింజంత అనుమతులతో కొండలన్నింటినీ బరితెగించి మరీ తవ్వేస్తున్నారు. లీజుకు తీసుకున్న దానికంటే హద్దులు దాటి మరీ క్వారీలను కొల్లగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 100 అడుగులకు పైబడి రిగ్ బ్లాస్టింగ్ చేస్తుండడంతో ప్రత్తిపాడు మండలంలోని పెద్ద శంకర్ల పూడి చుట్టుపక్కల గ్రామాలు దద్దరిల్లుతున్నాయి. నల్లరాతి క్వారీలు గ్రామానికి సమీపంలో ఉండడంతో పేలుళ్ల ధాటికి ఇళ్లు బీటలు వారుతున్నాయి. అర్ధరాత్రి క్వారీల్లో బాంబులతో బ్లాస్టింగ్ చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్న శంకర్ల పూడి, పెద్ద శంకర్ల పూడి, రౌతులపూడి మండలం ఎస్ పైడిపాల, గుమ్మరేగాల, రాఘవపట్నం, ఉప్పంపాలెం, ములగపూడి తదితర గ్రామాల్లో నల్ల రాతి క్వారీలు ఉన్నాయి. గోరంత అనుమతులతో కొండలను భారీ ఎత్తున తవ్వేస్తున్నా గనుల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్వారీ లీజుదారులకు రాజకీయ నాయకులు మద్దతు ఉండడంతో అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో ఇష్టానుసారంగా కొండలను కొల్లగొట్టడంతో పాటు యథేచ్ఛగా రిగ్ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. 12 మంది లీజుదారుల్లో అనేకమంది కాలపరిమితికి మించి తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకునే నాథుడే లేదు. టిప్పర్లు పరిమితికి మించి నల్లరాయిని తరలించుకుపోతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా రవాణాశాఖ అధికారులు సైతం పట్టించుకున్న దాఖలు లేవు. చిన్న శంకర్ల పూడి, పెద్ద శంకర్ల పూడి సర్వే నెంబరు 53,160,160/1లో అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

నల్లరాతి క్వారీల్లో బ్లాస్టింగ్ చేయాలంటే రెవెన్యూ, పోలీసు, గనులశాఖల అనుమతులు తీసుకోవాలి. చిన్న శంకర్ల పూడి, పెద్దశంకర్ల పూడి గ్రామాల్లోని నల్ల రాతి క్వారీ తవ్వకాల్లో నిబంధనలకు విరుద్ధంగా జిలెటిన్ స్టిక్‌లు వినియోగిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా తవ్వేస్తున్నారు. కొండలపై తవ్వకాలకు తొలుత బెంచ్ కట్ చేయాల్సి ఉంటుంది. తక్కువ పరిమితిలో బ్లాస్టింగ్ చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా 100 అడుగులు మించి రంధ్రాలు చేసి రిగ్ బ్లాస్టింగ్ చేయడంతో పరిసర గ్రామాల్లో ప్రకంపనలు ఏర్పడి గృహాలు బీటలు వారుతున్నాయి. ఇదేవిషయమై ఆయా గ్రామస్తులు కలెక్టర్‌కు, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గనులశాఖ అధికారులు లీజు దారులకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయినా అక్రమార్కులు కొండలను పిప్పిచేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏపీ ఎస్ఆర్ఎంలో 3 నుంచి ఇండియన్ అకాడమీ సైన్స్ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 88వ వార్షిక సమావేశాలకు ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వేదికగా మారింది. ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకూ ఆకాడమీ వార్షిక సదస్సులు జరుగనున్నాయి. 3వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఇస్రో, డిపార్ట్మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ప్రతిష్ఠాత్మక ప్రదర్శనను గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ ప్రారంభిస్తారు. రాష్ట్ర అటవీ, విద్యుత్, శాస్త్రీయ-సాంకేతికత శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గౌరవ అతిథిగా, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ ప్రత్యేక ఆహ్వానితులుగా కార్యక్రమానికి హాజరు కానున్నారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఏటా మూడు రోజుల పాటు ఆకాడమీ వార్షిక సమావేశాలను నిర్వహిస్తుంది. 1934లో బెంగళూరు కేంద్రంగా ఈ సమావేశాలు మొదలయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి నిర్వహణ బాధ్యతలు లభించాయి. నూతన పరిశోధనల ఆవిష్కరణలే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తారు. జాతీయ స్థాయిలో సైంటిఫిక్ ఎగ్జిబిషన్‌ను ఇస్రో, డిపార్ట్మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తారు. ఉపగ్రహ ప్రయోగాల పరికరాలు, నమూనా ఉపగ్రహాలు, ఇతరత్రా కీలక పరికరాలు, యంత్రాలను ప్రదర్శనలో ఉంచుతారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఇందుకు యూనివర్సిటీ ఆహ్వానిస్తోంది. అవసరమైన రవాణా సదుపాయాన్ని కల్పిస్తుంది. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్ కె. ఆరోరా, వైస్ ఛాన్సలర్ ఆచార్య నారాయణరావు సంబంధిత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమానికి ఏపీ పాఠశాల విద్యశాఖ కార్యదర్శి బి.రాజశేఖర్, సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి, కాలేజి విద్య కమిషనర్ పోలా భాస్కర్‌తో పాటు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి హాజరవుతారు.

'జయ బోండాలు' ధాన్యంపై కేరళ మక్కువ

- సరఫరా చేయాలని ఏపీని కోరిన మంత్రి జి.ఆర్.అనిల్
- రెండు రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రైతులు పండించే 'జయబోండాలు' ధాన్యం సరఫరా చేయాల్సిందిగా ఏపీ ప్రభుత్వాన్ని కేరళ కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, కేరళ ప్రభుత్వాల మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేరళ పౌరసరఫరాలశాఖ మంత్రి జి.ఆర్.అనిల్... రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే రేషన్ సరఫరా చేస్తున్న విధానాన్ని చూసి మెచ్చుకున్నారు. అనంతరం రెండు రాష్ట్రాలు కొన్ని రకాల నిత్యావసరాలను పరస్పరం సరఫరా చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును కేరళ పర్యటనకు ఆహ్వానించారు. మంత్రి కారుమూరి, పౌరసరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండ్యన్, ఏపీ డెయిరీ ఎండీ అహ్మద్‌బాబు ఇతర ఉన్నతాధికారులతో కూడిన బృందం కేరళలో పర్యటించింది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల మంత్రులు, ఆ శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో కొన్ని కీలకాంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పండే జయ రకం ధాన్యానికి తమ వద్ద బాగా డిమాండ్ ఉంటుందని, తమ అవసరాలకు సరిపడ సరఫరా చేయాలని కేరళ మంత్రి అనిల్ ఏపీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును కోరారు. జయ బోండాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యాన్ని సరఫరా చేయాల్సిందిగా కోరారు. ఇందుకు మంత్రి కారుమూరి సంసిద్ధత వ్యక్తం చేశారు. ధాన్యంతో పాటు ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కందిపప్పు, మినప్పప్పు, శనగపప్పు, ఎండుమిర్చి, ధనియాలు తదితర నిత్యావసరాలను కూడా సరఫరా చేయాలని అనిల్ కోరగా... దీనిపై మంత్రి కారుమూరి సానుకూలంగా స్పందించారు. ప్రజలకు మేలు చేసేందుకు సీఎం జగన్ అధ్వర్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి తీసుకున్న చర్యలను వారికి వివరించారు. రెండు రాష్ట్రాల మధ్య నిత్యావసరాల సరఫరా అవగాహన ఒప్పందం అనంతరం కేరళ మంత్రి అనిల్, ఆ రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అధికారుల బృందం మావెల్లి స్టోర్స్‌ను సందర్శించింది. స్టోర్స్ ద్వారా వినియోగదారులకు నిత్యావసరాల సరఫరాను పరిశీలించారు. ఏపీలో పండే మిర్చి, కంది, మినుము, శనగ, ధనియాలను మార్క్ ఫెడ్ ద్వారా మార్క్ ఫెడ్ బ్రాండ్ పేరుతో అక్కడి స్టోర్లకు అందిస్తామని మంత్రి కారుమూరి కేరళ మంత్రి అనిల్‌కు హామీ ఇచ్చారు.

మెస్ చార్జీలు పెంచండి

మధ్యాహ్న భోజన నిర్వాహకుల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంపుదల చేయాలని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ నీదియా మీనన్‌ను కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కరోనా కాలంలో రెండు సంవత్సరాలుగా మెస్ చార్జీలు పెంచలేదన్నారు. 1, 2, 3 తరగతుల విలీనం అనంతరం వస్తున్న సమస్యలపై అధికారులకు వివరించారు. ఇంటర్ విద్యార్థుల భోజనం బిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అడిషనల్ సంచాలకులు సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ నాయకులు పుల్లారావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి త్యాగరాజు పాల్గొన్నారు.

బ్రిటీష్ పోరులో ఆంధ్రా నిర్ణయాత్మక పాత్ర: గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్రిటీష్ వారిపై జరిపిన స్వాతంత్ర్య పోరులో ఆంధ్ర ప్రాంతం నిర్ణయాత్మక పాత్ర పోషించిందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో చాలామంది ఆంధ్ర ప్రాంత నాయకులు అగ్రగామిగా నిలిచారన్నారు. 56 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15న తుది శ్వాస విడిచిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన అత్యున్నత త్యాగం తరువాతే భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఆంధ్ర ప్రాంత ప్రజల డిమాండ్ తీవ్రస్థాయికి చేరుకుందన్నారు.



వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, విశిష్ట అతిథిగా సీఎం జగన్, ఆత్మీయ అతిథిగా వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 35 మంది ప్రముఖులకు (30 సంస్థలకు) అవార్డులను గవర్నరు, సీఎం అందజేశారు. సాహిత్య రంగానికిగాను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కు సంస్థ మేనేజర్ టి.మనోహర్ నాయుడుకు అవార్డు కింద రూ.10లక్షల చెక్కు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, పతకాన్ని సీఎం జగన్ అందజేశారు. సీఎం మాట్లాడుతూ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ చేస్తున్న ఎనలేని సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డును ప్రకటించిందన్నారు. ప్రభుత్వం తరఫున ఈ అత్యున్నత అవార్డులు ఇస్తున్నామని పేర్కొన్నారు. అవార్డు స్వీకరణ కార్యక్రమానికి విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి హాజరయ్యారు.

వీపీహెచ్‌కి అవార్డు అభినందనీయం: రామకృష్ణ

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్(వీపీహెచ్)కి వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు రావడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభినందనలు తెలిపారు. వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు స్వీకరణ అనంతరం విజయవాడ దాసరిభవన్‌లో రామకృష్ణను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు కలిసి అవార్డు వివరాలు తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ సాహిత్య రంగంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎంతో కృషి చేస్తోందన్నారు. 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అవార్డు రావడం పట్ల విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ యాజమాన్యం, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, సోషల్ మీడియా కన్వీనర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే సమగ్ర విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఓదార్చారు. చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. అండగా నిలుస్తామని హామీనిచ్చారు. గంటకుపైగా ఘటనాస్థలిలో గడిపిన మోదీ అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అహ్మదాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. అంతకుముందు సహాయక చర్యలు చేపట్టిన వారితోనూ మోదీ మాట్లాడారు. ఆ తర్వాత మోర్బీ ఎస్పీ కార్యాలయంలో అధికారులతో ప్రధాని సమీక్ష జరిపారు. ప్రమాదం తనను కలచివేసిందని మోదీ చెప్పారు. మృతుల, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. అహ్మదాబాద్‌లో తలపెట్టిన రోడ్‌షోను, వర్చువల్ 'పేజ్ కమిటీ సమ్మేళన్'ను ప్రధాని ఇప్పటికే రద్దు చేసుకు న్నారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించిన విషయం తెలిసిందే.

కాగా, మోదీ... మోర్బీ చేరకముందే వివాదం తలెత్తింది. ఆయన పర్యటన క్రమంలో రాత్రికి రాత్రి మోర్బిస్ సివిల్ హాస్పిటల్ రూపురేఖలను మార్చే ప్రయత్నాన్ని అధికారులు చేశారు. దీనిపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. భారీ సంఖ్యలో మరణాలు సంభవిస్తే ఏదో వేడుక జరుగుతున్నట్లుగా ఆసుపత్రికి రంగులు వేయడం, ముస్తాబు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ సందర్శించే ఆసుపత్రిలో జరుగుతున్న పనుల ఫొటోలను కాంగ్రెస్ ట్వీట్ చేసింది.

మరోవైపు మృతుల సంఖ్య 145కి చేరిందని అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని.. మరో వంద మంది మృతదేహాలు నది అడుగుభాగంలో ఉన్న బురదలో కూరుకుపోయి ఉంటాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారిలో రెండేళ్ల చిన్నారి సహా 47 మంది పిల్లలు ఉన్నారని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం వంతెన కూలిన వెంటనే గల్లంతైన వారి కోసం రాష్ట్ర, జాతీయ విపత్తు సహాయక బృందాలు గాలింపు ప్రారంభించినప్పటికీ.. చీకటి వల్ల కష్టంగా మారింది. దీంతో సోమవారం ఉదయాన్నే గాలింపు కొనసాగించారు. ఈ వంతెన ప్రమాదానికి సంబంధించి సీసీటీవీ ఫుటేజీ విడుదలైంది. బ్రిడ్జిపై ఉన్న కొంతమంది యువకులు సెల్ఫీలు తీసుకుంటుండగా.. మధ్యభాగంలో ఉన్నవారు ఆ వంతెనను అటూఇటూ ఊపేందుకు ప్రయత్నించడంతో అప్పటికే బరువు తట్టుకోలేకపోయిన బ్రిడ్జి కుప్పకూలిన దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. 125 మందిని మాత్రమే మోయగలిగే సామర్థ్యం ఉన్న ఆ వంతెనపైకి 500 మంది చేరడమే కాక.. దాన్ని ఊపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. నిర్లక్ష్యంతో ఈ ప్రమాదానికి కారకులుగా భావిస్తూ తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరమ్మతులు చేపట్టిన సంస్థలపై ఐపీసీ సెక్షన్ 304, 308 కింద కేసులు నమోదు చేశారు. సాంకేతిక, నిర్మాణ లోపాలు, నిర్వహణ సమస్యలే ప్రమాదానికి కారణమని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. నిర్వాహకులు మరమ్మతులు సరిగ్గా చేయలేదని, నాణ్యత పరీక్షలు కూడా చేపట్టలేదని ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో ఒరేవా కంపెనీ మేనేజర్లు ఇద్దరు, మరో ఇద్దరు టికెట్ విక్రేతలు, ఇద్దరు మరమ్మతు కాంట్రాక్టర్లు, ముగ్గురు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. నిందితుల్లో కంపెనీ పెద్దలెవరూ లేకపోవడం గమనార్హం. ఈ బ్రిడ్జి మరమ్మతుల బాధ్యతను 2022 నుంచి 2037 వరకు ఒరేవా అనే వాచ్‌ల తయారీ కంపెనీకి చెందిన అజంతా మాన్యుఫాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు మోర్బీ మునిసిపాలిటీ అప్పజెప్పింది. మరమ్మతులు చేయాల్సిన ఆ సంస్థ సాంకేతిక పనులను 'దేవ్‌ప్రకాశ్ సొల్యూషన్స్' అనే మరో కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టింది. ఈ ఏడాది మార్చిలో మరమ్మతులు మొదలుపెట్టి అక్టోబరు 26న పునరుద్ధరించింది. ఒప్పందం మేరకు మరమ్మతుల ఖర్చులను రాబట్టుకునేందుకు సందర్శకుల నుంచి రూ.17 చొప్పున టికెట్ వసూలు చేస్తోంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే బ్రిడ్జిని పునరుద్ధరించారని మోర్బీ మున్సిపల్ చైర్మన్ సందీప్‌సింగ్ జాలా వ్యాఖ్యలపై ఒరేవా సంస్థ స్పందించలేదు. వంతెన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో రాజ్‌కోట్ ఎంపీ మోహన్ కుందరియా కుటుంబ సభ్యులు 12 మంది ఉన్నారు. వారిలో ఐదుగురు చిన్న పిల్లలు, నలుగురు మహిళలు. ఆటవిడుపుగా వంతెన వద్దకు వెళ్లినవారంతా నీటమునిగి దుర్మరణం చెందారు. తన పెద్దన్న బావమరిది కుమార్తెలు, వారి భర్తలు, ఐదుగురు పిల్లలు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

ఉద్యోగుల డిమాండ్లు పట్టవా?

ఖాళీల భర్తీలో అలసత్వం

జీజీహెచ్ సూపరింటెండెంట్ తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి విఫలమయ్యారని, ఉద్యోగుల పట్ల ఆమె మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వద్దే బాలయ్య ఆరోపిం చారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్నా భర్తీ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు సంబంధించిన 26 సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం జీజీహెచ్ సూపరిం టెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళనకు దిగారు. బాలయ్య మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని డాక్టర్ ప్రభావతికి ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆసుపత్రిలో రోగుల కోసం బెడ్లు పెంచుతున్నారు... డాక్టర్లు, నర్సుల ఖాళీలు భర్తీ చేస్తున్నారు...కానీ కిందిస్థాయి సిబ్బందిని మాత్రం భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. ల్యాబ్, రేడియోగ్రాఫర్, ఎక్సరే డిపార్ట్‌మెంట్ సిబ్బందిని, ఫార్మా సిబ్బందిని, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్ఓలను నియమించి సిబ్బందిపై భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లోనే ఇన్ని ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఇంకా ఎన్ని ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు మాట్లాడుతూ మాట తప్పను...మడమ తిప్పనన్న జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్ రద్దు విషయంలో మాట తప్పి మడమ తిప్పారని విమర్శించారు. తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయడంలో అధికారులు కావాలనే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సిన రాయితీలు తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని మండి పడ్డారు. నిరసనలో బ్రాంచ్ కోశాధికారి కె.వెంకటకృష్ణ, బ్రాంచ్ నాయకులు వెంకటేశ్వరరావు, నాగరాజు, ఐ.వెంకటేశ్వరరావు, ఆర్.కోటేశ్వరరావు, డి.కుమార్ రాజా, బీజే బాలాజీ, సీహెచ్ మంగమ్మ, మాణిక్యం, వి.శ్రీధర్, సీహెచ్ కృష్ణ, ఆర్.కమలకుమారి, ఎ.అంజలి, షేక్ మస్తాన్ బీ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాప్తాడులో సునీత పాదయాత్ర

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రైతుల సమస్యలపై పాదయాత్రకు మాజీ మంత్రి పరిటాల సునీత సిద్ధమయ్యారు. అనంతపురం జిల్లా, రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల నుంచి ఈనెల 3న పాదయాత్ర ప్రారంభం కానుంది. రైతు కోసం - తెలుగుదేశం నినాదంతో పాదయాత్ర చేస్తున్నట్లు సునీత చెప్పారు. తల్లిమడుగుల, బాలేపాల్యం, కోనాపురం గ్రామాల మీదుగా కనగానపల్లి వరకు పాదయాత్ర సాగుతుంది. అక్కడ రెవెన్యూ అధికారులకు పంట నష్టంపై వినతి పత్రం ఇవ్వనున్నారు. మార్గమధ్యంలోని గ్రామాల్లో రైతులను పరామర్శిస్తూ పంట నష్టం వివరాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతారు. ప్రతి వారం ఒక్కో మండలంలో పాదయాత్ర సాగుతుందని సునీత చెప్పారు. పంట నష్టం ఎక్కువగా ఉన్న ప్రాంతాల మీదుగా పాదయాత్ర ఉంటుందన్నారు. టీడీపీ కార్యకర్తలతో పాటు అన్ని వర్గాల వారు పాల్గొవాలని ఆమె పిలుపునిచ్చారు.

హెడ్ కానిస్టేబుల్ 'తలగడదీవి'కి

వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత సాఫల్య పురస్కారంను హెడ్ కానిస్టేబుల్ తలగడదీవి శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. విజయవాడ ఎ.కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్ ఆయనకు అవార్డు అందజేశారు. శ్రీనివాస్ 25 ఏళ్లుగా పోలీస్ శాఖలో సేవలందిస్తున్నారు. చాలా సార్లు అత్యంత సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. కరోనా సమయంలోనూ అనేక సేవలు అందించి అధికారుల ప్రశంసలు పొందారు. ప్రస్తుతం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా శ్రీనివాస్ పనిచేస్తున్నాడు. ఇటీవల పోరంకి శాలిపేటలో సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్ షేక్ హరుకున్నీసాపై భర్త ఇస్మాయిల్ దాడికి దిగాడు. ఆమె దిశ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా ఏడు నిముషాల్లో హెడ్ కానిస్టేబుల్ ఘటన స్థలానికి చేరుకుని ఆమెను రక్షించాడు. అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలించి నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నారు. అదనపుకట్నం కోసం ఆమెను నిత్యం వేధిస్తూ ఉండేవాడని తెలిసింది.

4న ఇథనాల్ కర్మాగారానికి సీఎం శంకుస్థాపన

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-గోకవరం: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం బొమ్మల దొడ్డి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కర్మాగారానికి ఈ నెల 4న సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం జగన్ రానుండడంతో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి జయ సత్యనారాయణ, కోరుకొండ నార్త్ జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు సభా ప్రాంగణాన్ని, హెలీపాడ్‌ను స్థానిక నాయకులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ డాగ్‌లతో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. పాటి రాంబాబు, సమ్మెట రాంబాబు, సుంకర వీరబాబు బత్తుల మురళి పోతాబత్తుల శ్రీనివాసరావు, తోలేటి ప్రసాదు, కర్రీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు సాగుకు రాయితీలివ్వాలి

ప్రభుత్వానికి ఏపీ రైతు సంఘం వినతి

విశాలాంధ్ర-విజయవాడ: చెరకు పంట విత్తనానికి 50శాతం రాయితీ, చెరకు నరుకుడు యంత్రాలకు 75శాతం రాయితీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాధ్‌కు లేఖలు రాశారు. వాణిజ్య పంటలలో చెరకు ప్రధానమని, వేలాదిమంది రైతులు చెరకు సాగు చేస్తున్నారని, ఆరేళ్లలో చెక్కర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలతో పంట విస్తీర్ణం తగ్గిందని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. చక్కెర పరిశ్రమపై ఆధారపడే రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు వేలాది మంది ఉన్నారన్నారు. సాగు వ్యయం పెరగటం, చెరకు నరకు కూలీల కొరత, యాంత్రీకరణ, పరికరాలు అందుబాటులో లేక గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారని కేవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమ సైతం నష్టాల ఊబిలో నెట్టబడిందని, చాలా కర్మాగారాలను వేసివేశారని లేఖలో పేర్కొన్నారు. ఈ పరిస్థితులలో చెరకు రైతులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు 50శాతం విత్తన రాయితీ అవసరమన్నారు. 'ఒంటి కన్ను ముచ్చ' ద్వారా పెంచిన నారును రైతులు వాడుతున్నట్లు తెలిపారు. చెరకు రైతుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని 50శాతం రాయితీపై ఒంటి కన్ను ముచ్చలతో పెంచిన చెరకు విత్తనాన్ని రైతాంగానికి సరఫరా చేసేందుకు, చెరకు నరుకుడుకు అవసరమైన యంత్రాలు రైతాంగానికి 75శాతం రాయితీపై అందించాలని కోరారు. చెరకు పంట ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతి టన్నుకు సుమారు రూ.300కు పైగా పన్ను రూపంలో ఆదాయం వస్తున్నదన్నారు. ఈ స్థితిలో చెరకు పంట విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. చెరకు సాగు పెంపు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు రైతు ప్రతినిధులు, ఫ్యాక్టరీల యాజమాన్య ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటునకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సృజనాత్మకత వెలికితీసేలా సాంకేతిక ఆవిష్కరణలు

పాలీటెక్ ఫెస్ట్-2022 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ: బుగ్గన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వినూత్న ఆలోచనలకు ఒక రూపును అందించే క్రమంలో పాలీటెక్ ఫెస్ట్-2022ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులు, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాలీటెక్ ఫెస్ట్-2022 వాల్ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ విజయవాడలో నవంబర్ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు ఈ రాష్ట్ర స్థాయి కార్యక్రమం జరగనుందని, అన్ని జిల్లాల్లోని పాలిటెక్నిక్ విద్యార్థులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి టెక్ ఫెస్ట్ నిర్వహించడం ఆనవాయితీగా ఉండగా, కరోనా కారణంగా 2020లో నిర్వహించలేదని అన్నారు. సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వార్షిక టెక్నికల్ ఫెస్ట్ విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం చూపుతుందన్నారు. ఈ సంవత్సరం టెక్ ఫెస్ట్‌లో 84 ప్రభుత్వ, 173 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లు పాల్గొననుండగా, రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముందు జిల్లా స్థాయిలోనూ నిర్వహిస్తామని వివరించారు. మూడు రోజుల కార్యక్రమంలో 800 పైగా సృజనాత్మక ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని అంచనా వేసామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాలు దక్కించుకున్నవారికి రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేల నగదు బహుమతులు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు, 15 వేలు నగదు బహుమతులు అందిస్తారన్నారు. సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు పద్మారావు, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి కె.విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఖైదీలకు 'ఉపాధి'పై శిక్షణ ఇవ్వండి

జైళ్ల స్థితిగతులపై అధికారులతో హోంమంత్రి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వివిధ జైళ్ల పరిస్థితులపై మంగళవారం స్థానిక సచివాలయం రెండో బ్లాకులో రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. సెంట్రల్ జైళ్లు, సబ్ జైళ్లు సహా ఇతర జైళ్లలోని స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి సత్ప్రవర్తన, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జైళ్లలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయా అని సూపరింటెండెంట్లను అడగ్గా , చాలా వరకు అందుబాటులో ఉన్నట్టు అధికారులు మంత్రికి వివరించారు. జైళ్ల సిబ్బంది పరిస్థితులు, ఇతర అంశాలపై ఆరా తీశారు. ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ఉపాధి అవకాశం పొందే రీతిలో తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీల భర్తీతోపాటు వాహనాలు సమకూర్చాల్సిన అవసరముందన్నారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, జైళ్లశాఖ డీఐజీలు డాక్టర్ వరప్రసాద్, కిరణ్, జైళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సీఎం క్యాంపు కార్యాలయంలో

రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, హోంశాఖ మంత్రి తానేటి వనిత, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ ఎన్ లక్ష్మీపార్వతి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

25న పార్లమెంట్ మార్చ్ జయప్రదం చేయాలి

ఏఐవైఎఫ్-ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టును అమలులోకి తీసుకుని రావాలని, దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 25న పార్లమెంట్ మార్చ్‌ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు కోరారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం చలో పార్లమెంట్ మార్చ్ పోస్టరును నేతలు ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి.... ఎనిమిది సంవత్సరాల గడుస్తున్నా నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా దగా చేశారన్నారు. పైపెచ్చు నిరుద్యోగుల సమస్యల గురించి ప్రశ్నిస్తే నిరుద్యోగులు పకోడీ బండ్లు పెట్టుకుని బతకండి అంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 27 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్‌ను అమలులోకి తీసుకురావాలన్నారు. ఈనెల 25న ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చ్‌కు రాష్ట్రం నుంచి నిరుద్యోగ యువత పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జి.నాగ రాముడు, షేక్ సుభాని, ఎంవీ సుబ్బారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు, షేక్ అలీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ గుజ్జుల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలకు సహకారం: మంత్రి అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడం ఎంతో శుభపరిణామమని పరిశ్రమలు, వాణిజ్యం , ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక హోటల్‌లో మంగళవారం అసోషియేషన్ ఆఫ్ లేడి ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1993లో ప్రారంభమైన ఈ సంస్థ ద్వారా సుమారు 70వేల మందికి శిక్షణ ఇవ్వగా అందులో 10వేల మంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఏపీ ప్రభుత్వం అసోషియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఒప్పందంలో భాగంగా మన ప్రాంతంలో 100 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అందులో 75 మంది మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్‌లోను, మిగిలిన 25 మందికి గార్మెంట్స్, టెక్స్ టైల్స్ రంగంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విమెన్ ఎంటర్‌ప్రైజెస్ ఎక్కువగా స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ లో ఉంటాయన్నారు. అసోషియేషన్ ఆఫ్ లేడి ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా నిర్వహణ నిమిత్తం విశాఖపట్నంలో గాని, అనకాపల్లిలో గాని 25 నుంచి 30 ఎకరాల భూమిని కేటాయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ వారికి కావాల్సిన సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని మంత్రి చెప్పారు. తొలుత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిశ్రమల ప్రభుత్వ సలహాదారు వీరారెడ్డి పాల్గొన్నారు.

భారత్‌తో బలమైన దౌత్య సంబంధాలు

ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సారా కిర్లేవ్

విశాలాంధ్ర-విశాఖసిటీ: భారత దేశంతో బలమైన దౌత్య సంబంధాలను తమ దేశం కలిగి ఉందని ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ సారా కిర్లేవ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆస్ట్రేలియా విశ్వవిద్యాయాలతో కలసి పనిచేయడానికి ఇటీవల జరిగిన చర్చలు, తదితర అంశాలను వీసీ వివరించారు. ఏయూలో ఇప్పటికే జపనీస్ కార్నర్, అమెరికన్ కార్నర్ ఏర్పాటు అయ్యాయని, ఇదే తరహాలో ఆస్ట్రేలియా కార్నర్ సైతం ఏర్పాటు చేయాలని వీసీ ప్రతిపాదించారు. ఏయూలో దశాబ్దాలుగా సార్క్ అధ్యయన కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. బలమైన మెరైన్ లివింగ్ రిసోర్సెస్, సివిల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ విభాగాలు ఉన్నాయన్నారు. విశాఖ నగరం ప్రత్యేకతలు, విశిష్టతలను ఆస్ట్రేలియా ప్రతినిధులకు వివరించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు తాము నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ పనితీరు, విధివిధానాలను అతిథులకు తెలియజేశారు. అకడమిక్ సెనేట్ మందిరంలో 'ఇండో పసిఫిక్ భాగస్వామ్యంతో సహకారాన్ని బలోపేతం చేయడం-పరస్పరం మెరుగుపరుచుకోవడం' అంశంపై నిర్వహించిన ప్యానల్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ, మేరిటైం భద్రత, సహజ-మానవ ప్రమేయ విపత్తులు, పర్యావరణ మార్పులు, వాతావరణ మార్పులు అంచనా వేయడం తదితర అంశాలపై నిపుణులు చర్చించాలన్నారు. కాన్సులేట్ జనరల్ అధ్యక్షతన జరిగిన ప్యానల్ చర్చలో చెన్నై సెంటర్ ఫర్ చైనా స్టడీస్ డైరెక్టర్ జనరల్ కమోడోర్ ఆర్.ఎస్ వాసన్, సీనియర్ రిసెర్చ్ ఎనలిస్ట్ బాలసుబ్రహ్మణియన్, కీల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ మేరిటైం స్ట్రాటజీ అండ్ సెక్యూరిటీ ఫెలో జస్టిన్ బుర్క్, సీపీపీఆర్ (కోచి) రీసెర్చర్ సుసాన్ కోషి, ఐఎంయు (చెన్నై) సీఓ కమోడోర్ కె.డి జోషి తదితరులు ప్రసంగించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పాలక మండలి సభ్యులు ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఇండో-పసిఫిక్ ఎండీవర్ కమాండర్ మాల్ వైజ్, రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ కెప్టెన్ ఫిలిపా హే తదితరులు పాల్గొన్నారు. ఏయూ తరపున కాన్సుల్ జనరల్ సారా కిర్లేవ్‌ను సత్కరించారు.

అపురూప శిల్పాలు... శాసనాలు కాపాడుకోవాలి

- ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి
- కొలకలూరులో వెయ్యేళ్లనాటి పురావస్తు సంపద
- ఆదరణ కరువుతో ప్రాచీనతకు భంగం

విశాలాంధ్ర - తెనాలి : గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న కొలకలూరులో వెయ్యేళ్లనాటి శిల్పాలు, 800 ఏళ్ల నాటి శాసనాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి అన్నారు. యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి అందజేసిన సమాచారం మేరకు ఆయన సోమవారం కడియాల వెంకటేశ్వరరావుతో కలసి అగస్తేశ్వర, కేశవస్వామి దేవాలయాలను పరిశీలించి ఆసక్తికరమైన చారిత్రక విషయాలను వెల్లడించారు. కొలకలూరులో క్రీస్తుశకం 1241, 1242, 1318 నాటి నాలుగు శాసనాల్లో ఆ ఊరిపేరు కొలంకలూరు, కొలంకులూరు అని ఉందని, ముందు వేంగీ చాళుక్యులు, చాళుక్య చోళులు ఆ తరువాత వెలనాటి చోళులు, కాకతీయుల పాలనతో గ్రామంలోని ఆలయాలు వైభవోపేతంగా వెలుగొందాయన్నారు. కాకతీయ ప్రతాపరుద్రుని సకల సైన్యాధ్యక్షుడైన సోమయలెంక... కొలకలూరు గ్రామస్తుదేనని, గ్రామంలోని రెండు ఆలయాలకు కుటుంబ సభ్యులు భూమిని దానం చేశారని శివనాగిరెడ్డి వివరించారు.

కొండపడుమటి బేతరాజు సైనికుడైన రెంటూరి ఎక్కటి క్రీస్తుశకం 1241లో అగస్తీశ్వరుని అఖండ దీపానికి కావలసిన ఏడు మానికల నేయి కోసం 50 ఆవుల్ని, స్థానిక అమరినాయుడు, ఆలయ నాట్యగత్తెలు (సానులు) కోసం రెండు పుట్ల భూమిని దానం చేశాడని, క్రీస్తుశకం 1318లో కాకతీయ ప్రతాపరుద్రుని సకలసైన్యాధిపతి, సోమయలెంక కుమారుడు పోచులెంక, అగస్తీశ్వరుని వీరభద్రుని సోమవార నిబంధనపళ్లేనికి ఎనిమిది పుట్ల భూమిని, కేశవ పెరుమాళ్ల శనివార నిబంధన పళ్లేనికి ఏడు తూముల భూమిని దానం చేసినట్టు వివరాలున్నాయని చెప్పారు.

కొలకలూరులో వెయ్యేళ్లనాటి మహిషమర్దిని, శివలింగాలు, నంది, నాగదేవత, నాట్యగత్తెల అపురూప శిల్పాలున్నాయని, ఆలయాల జీర్ణోద్ధరణ సందర్భంగా ఊడదీసిన ద్వారపాలశిల్పాలున్న ద్వారశాఖలపై సారువా కట్టెల్ని పెట్టారని, స్తంభాలు, ద్వారం పైభాగం రోడ్డుపై నిర్లక్ష్యంగా పడిఉన్నాయని, కేశవ పెరుమాళ్ల దేవాలయ గోడలపై ఉన్న అందమైన ద్వారపాల శిల్పాలపై విచ్చలవిడిగా రంగులు వేయటంతో ప్రాచీనతకు భంగం వాటిల్లిందని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చారిత్రక ప్రాధాన్యతగల శిల్పాలు, శాసనాలు, ద్వార శాఖలు, స్తంభాలను పీఠాలపై నిలబెట్టి కాపాడుకోవాలని గ్రామస్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

మరో ఆశాకిరణం బ్రెజిల్

లాటిన్ అమెరికాదేశాలు క్రమంగా వామపక్ష రాజకీయాల వేపు మొగ్గుతున్న దశలో విస్తీర్ణంలో, జనసంఖ్యలో ఆ ప్రాంతంలో పెద్దదైన బ్రెజిల్ లో లూలా మూడవ సారి అధ్యక్షుడు కావడం గాలి మార్పునకు స్పష్టమైన సంకేతం. అంతకు ముందు లూలా రెండు సార్లు 2002 నుంచి 2010 దాకా అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బోల్సు నారోను లూలా గద్దె దించగలిగారు. బ్రెజిల్‌లో అధికారంలోకి వచ్చిన వారు వరసగా రెండు సార్లు విజయం సాధించడం రివాజు. కాని బోల్సునారో రెండవ సారి విజయం సాధించలేకపోవడం విశేషం. 1980లో బ్రెజిల్ లో ప్రజాస్వామ్యం పునరుద్ధరణ తరవాత రెండో సారి గెలవని నాయకుడు బోల్సునారో మాత్రమే. లూలా 50.9 శాతం ఓట్లు సంపాదిస్తే బోల్సునారో 49.1 శాతం ఓట్లు సంపాదించగలిగారు. లూలా విజయం ప్రజాస్వామ్య శక్తుల విజయానికి సంకేతం. బోల్సునారో నిరంకుశాధికారానికి లూలా విజయంతో అడ్డుకట్ట పడింది. అయితే బోల్సునారో 2018లో సాధించిన ఓట్ల కంటే కొద్దిగా ఎక్కువ ఓట్లు సంపాదించినా విజయం దక్కలేదు. కానీ లూలా 2018 కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ ఓట్లు సాధించారు. లూలాకు చాలా కాలంగా వ్యతిరేకి అయిన మాజీ అధ్యక్షుడు ఫెర్నాండో హెన్రిక్ చర్డొసా కూడా లూలావిజయం సాధించినందుకు అభినందించడమే కాక ప్రజాస్వామ్యం గెలిచింది అని వ్యాఖ్యానించారు. లూలా విజయం సైనిక నియంతృత్వానికి తెర దించింది. ఇది మానవాళి సాధించిన విజయం అని కూడా ప్రజాస్వామ్య వాదులు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో లూలా ప్రజాస్వామ్యం, ఆచరణ వాదం అవసరాన్ని నొక్కి చెప్పారు. పౌర హక్కుల ఆవశ్యకత ఏమిటో తెలియజెప్పారు. గత నాలుగేళ్ల బోల్సునారో పాలనలో ప్రజలను నిర్లక్ష్యం చేశారు.

ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం ఛిన్నాభిన్నం అయిపోయాయి. సుస్థిరత కరువైంది. అందువల్లే బోల్సునారో మీద వ్యతిరేకత ప్రస్ఫుటంగా వ్యక్తం అయింది. లూలా గా ప్రసిద్ధుడైన లూయీ ఇనాసియో లూలా డ సిల్వా కార్మిక వర్గానికి చెందిన మొదటి అధ్యక్షుడు. ఆయనకు కార్మికుడిగా పని చేసిన అనుభవం ఉంది. నిరుపేద, నిరక్షరాస్య కుటుంబంలో పుట్టిన లూలా గత నాలుగు దశాబ్దాల నుంచి బ్రెజిల్ రాజకీయాల్లో నిరంతరం కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారు. కార్మిక సంఘ నాయకుడిగా సమ్మెలు నిర్వహించి 1980లో ఆయన శ్రామికవర్గ ఏలుబడి తీసుకొచ్చారు. "లూలా ప్రపంచంలోనే అత్యంత పలుకుబడి గలిగిన నాయకుడు" అని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారంటే సైద్ధాంతికంగా విరోధి అయిన వారి మన్నన కూడా పొందారనే. లూలా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చమురు, నౌకా నిర్మాణం బాగా పుంజుకున్నాయి. బ్రెజిల్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఆరో స్థానానికి చేరుకుంది. అయితే లూలా రాజకీయ ప్రస్థానం చీకటి వెలుగుల సంగమం. ఇదివరకు ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కున్నారు. 2017లో ఆయనకు తొమ్మిదిన్నరేళ్ల శిక్ష పడింది. సుప్రీం కోర్టు జోక్యంవల్లే ఆయన 19నెలలు శిక్ష అనుభవించిన తరవాత విడుదలయ్యారు. ఆయనకు శిక్ష పడినందువల్ల 2018 ఎన్నికలలో పోటీ చేయలేక పోయారు. జైలు నుంచి బయటకు వచ్చిన లూలా ఆచరణాత్మక రాజకీయ పంథా అనుసరించారు. పెరుగుతున్న ఆకలి, నిరుద్యోగానికి వ్యతిరేకంగా పోరాడారు. వామ పక్షం వేపు మొగ్గే సామాజిక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించే వారిని కూడగట్టి విస్తృత ప్రాతిపదికన వామపక్షం వేపు మొగ్గే మధ్యేమార్గ రాజకీయాలు అనుసరించారు. ఎన్నికల ప్రచార క్రమంలో లూలా తన వామపక్ష భావజాలాన్ని కొద్దిగా పలచన చేసుకున్నారు. క్రైస్తవ మతాన్ని వ్యాపింప చేసే వర్గాన్ని ఆకర్షించడం కోసం బైబిల్ నుంచి అనేక అంశాలను ఉటంకించారు కూడా.

ఎన్నికలు హోరాహోరీగా జరగడం పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా స్వల్పం కావడంతో భవిష్యత్తులో ఎలా మెలగాలో లూలా గ్రహించారు. దేశం ఆత్మను పునరావిష్కరించి సంఘీభావాన్ని సాధించాలని, విభేదాలను సైతం గౌరవించాలని అంటున్నారు. అందుకే తనకు ఓటు వేసిన వారికి మాత్రమే కాకుండా దేశవాసులందరి శ్రేయస్సు కోసం పాటు పడ్తానని భరోసా కల్పిస్తున్నారు. బ్రెజిల్ అంతా ఒకటే. బ్రెజిల్ ప్రజలందరూ ఒకటేనన్నది ప్రస్తుతం ఆయన ప్రధాన నినాదం. బోల్సునారోను ఓటమి భయం ముందు నుంచే పీడిస్తోంది. అయినా ఇంతవరకు తన పరాజయాన్ని అంగీకరించలేదు. తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోతే ఆ ఫలితాలను సవాలు చేస్తానని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలపైన నమ్మకం లేదని ఎన్నికల ప్రచారంలో పదేపదే చెప్తూనే ఉన్నారు. బ్రెజిల్ కార్మికవర్గ పార్టీ నాయకుడైన లూలా సామాజిక అసమానతలు, పేదరికం రూపుమాపడం మీద దృష్టి కేంద్రీకరిస్తానని చెప్తూ వచ్చారు. సంపన్నుల మీద పన్నులు పెంచుతానని, విస్తృత ప్రజానీకానికి ఉపకరించే ఆర్థిక విధానాలు అనుసరిస్తానని, కనీస వేతనాలు పెంచుతానని లూలా హామీ ఇచ్చారు. దీనికి విరుద్ధంగా బోల్సునారో ప్రభుత్వరంగంలో ఉన్న చమురు కంపెనీలను ప్రైవేటీకరిస్తాననీ, అమెజాన్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకానికి అనుమతిస్తానని, తుపాకుల లైసెన్సు పొందడానికి మార్గం సుగమం చేస్తానని ఉన్నత వర్గాలకు అనుకూల హామీల వర్షం కురిపించారు. బోల్సునారో ప్రవేశ పెట్టిన దుష్ట సంప్రదాయాలను తిరగదోడడం, తుపాకి రాజ్యాన్ని అంతమొందించడం, అమెజాన్‌ను సంరక్షించడం, అంతర్జాతీయంగా ఏకాకి అయిపోయిన బ్రెజిల్‌ను మిగతా దేశాలతో అనుసంధానించడం లూలా తన తక్షణ కర్తవ్యాలుగా భావిస్తున్నారు. లూలా విజయం సాధించి ఉండవచ్చుగానీ ఆయన ఎదుట ఉన్న సవాళ్లు భీకరమైనవే.

అమెజాన్‌కు పర్యావరణ పరంగా జరిగిన నష్టాన్ని పూడ్చడం, సామాజిక, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసే బృందాలను సమీకరించడం, విద్వేష ప్రచారాన్ని అంతం చేయడం లాంటి సవాళ్లను లూలా ఏ మేరకు ఎదుర్కోగలరో వేచి చూడాల్సిందే. అయితే నిరాశలో కుంగి పోయిన దేశ వాసులలో లూలా విజయం కొత్త ఆశలు చిగురింప చేసిందన్నది మాత్రం వాస్తవం. ప్రజాస్వామ్యం మీద ప్రజలకు మళ్లీ నమ్మకం కుదరడానికి లూలా విజయం సంకేతం. 2002 లో లూలా మొదటి సారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఆయన రాజకీయ పంథా అప్పుడున్నట్టుగా లేదు. మధ్యవాదులతో రాజీపడక తప్పని స్థితిలో ఉన్నారు. బోల్సునారోను ఓడించడానికి ఆయన మధ్యేమార్గం వేపు మొగ్గవలసి వచ్చింది. ఆయన ఏర్పాటు చేసిన కూటమిలో వామపక్ష వ్యతిరేకులూ ఉన్నారు. బ్రెజిల్ పార్లమెంటు ప్రస్తుతం మితవాదుల మయం అయిపోయింది. ఈ వైరుధ్యాలను సమన్వయం చేయడం లూలా ప్రథమ కర్తవ్యం అవుతుంది. బోల్సునారో మితవాద రాజకీయాలు అనుసరించడమే కాక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు విరుద్ధంగా ఈ ఏడాది ఆరంభం నుంచే ప్రచారం చేస్తున్నారు. ఈ పరికరాల దుర్వినియోగం ఎలా సాధ్యమో మాత్రమో చెప్పలేక పోయారు. ఇలాంటి విలోమ రాజకీయాలు ప్రస్తుతానికి అంతమైనట్టు కనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో మళ్లీ తలెత్తబోవన్న నమ్మకం ఏమీ లేదు. అందువల్ల ఈ దుష్ప్రచారాన్ని ఎదుర్కోవడం కూడా లూలాకు పెద్ద పనే.

మూఢనమ్మకాలతో జనం సతమతం

శాస్త్రజ్ఞానం పెరుగుతుంది. పిల్లలూ, తల్లిదండ్రులూ డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులుకావాలని కలలుకంటున్నారు. స్కూళ్లలోను, కాలేజీల లోను సైన్సుకే పెద్దపీట వేస్తున్నారు. హ్యూమన్ సైన్సులను, భాషలను ముఖ్యంగా మాతృభాషను పనికిరాని విద్యలుగ జమగట్టి వాటికి ప్రాముఖ్యత ఇవ్వడం లేదు. సైన్స్ మనకందిచ్చే నూతన ఆవిష్కరణలను హాయిగ అనుభవిస్తున్నారు. కానీ ఆ సైన్సు మానవ జీవితంలోఎలాంటి మార్పులు తెచ్చింది, మానవుడు ఎలా ఆవిర్భవించాడు, ఎలా క్రమ, క్రమంగా మారుతూ ఈనాటికి ఈ స్థితిని చేరుకున్నాడు అని ఆలోచంచటం లేదు.

అధికశాతం విజ్ఞానాన్ని, శాస్త్రజ్ఞానాన్ని పక్కనపెట్టి విచక్షణారహితంగా ఉంటున్నారు. దేవుళ్ళను, దెయ్యాలను, పూర్వ జన్మలను, అతీంద్రియ శక్తులను, భూత, ప్రేతాలను నమ్ముతున్నారు. కొత్త కొత్త మూఢనమ్మకాలతో సమయాన్ని ధనాన్ని వృధా చేసుకుంటున్నారు. పేదవాళ్ళు అప్పులు చేసి మరీ ముడుపులని, మొక్కులని సమయం, ధనం పోగొట్టుకుంటున్నారు. సంప్రదాయం, ఆచారాలుపేరుతో కొంతమంది మనోభావాలను కించ పరుస్తున్నారు. ఉదాహణకు భర్త లేని స్త్రీలను ఇంకా ఇబ్బందులకు గురి చేస్తూనే ఉన్నారు. ఇక డాక్టర్లకు తమ శక్తిపై నమ్మకం లేదు. ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు, విద్యావంతులు తమ విజ్ఞానానికి, శాస్త్ర జ్ఞానానికి తిలోదాకాలిచ్చి మూఢనమ్మకాలతో, ముఢాచారాల వెంట పరుగులు పెడుతున్నారు. ఈరోజు 99% హాస్పిటల్స్‌లో దేవుడి విగ్రహాలుండి వాటికి రోజువారి పూజలు జరుగుతున్నాయి. వైద్యం చేసే డాక్టర్లకు వైద్యం పై కంటే దేవుడి పై ఎక్కువ నమ్మకం. డాక్టర్లు వారి వృత్తిలో ఎదురయ్యే అనేక సమస్యలను దేవుడే పరిష్కరిస్తాడని నమ్ముతున్నారు. వారి వైద్యం విజయవంతమైతే అది దేవుడి దయ అని డాక్టర్లు, పేషేంట్లు కూడా అనుకుంటున్నారు. వైద్యం ఏ పరిస్థితిలోనైనా విజయవంతం కాకపోతే అది డాక్టర్‌దే తప్పనుకుంటారు. కాని నిజానిజాలు విచారించరు. అలాగే ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఒకరేమిటి విద్యావంతుల్లో అధికశాతం ఈ నమ్మకాలు కలవాళ్లే. వీళ్ళ పరిస్థితే ఇలా వుంటే ఇక సామాన్యుల సంగతేమిటి.

కొబ్బరికాయ కొట్టి పూజచెయ్యకుండ మొదలుపెట్టే ఇల్లుకానీ ప్రాజెక్టులు కానీ ఉండవు. చివరికి శ్రీహరి కోటలో అంతరిక్షంలో దూసుకు కెళ్లే రాకెట్లతో సహా పూజతోనే మొదలవుతున్నాయి. పూజలు చేసినా, ప్రార్థనలు చేసినా జబ్బులెందుకు నయంకాలేదో, ఆపరేషన్లు ఎందుకు విజయవంతం కావటం లేదో ప్రశ్నించుకోరు. వాస్తులు చూపించి, పూజలు చేసినా ఈ ఇళ్లు ప్రాజెక్టులు ఎందుకు కూలుతున్నాయో ఆలోచించరు. పూజలు చేసి వాస్తులు చూపించి ఆర్భాటంగా గృహ ప్రవేశాలు చేసినా ఆ యిల్లు కట్టాక ఎవరికయినా ప్రమాదకర జబ్బు చేస్తేనో, ఎవరయినా చనిపోతేనో ఆ ఇంటి వాస్తు బాగాలేదని మరో వాస్తు నిపుణుడు చెపుతారు. అయినా అవే నమ్ముతున్నారు. ప్రకృతి వైపరీత్యాలను శాస్త్ర జ్ఞానంతో విశ్లేషించకుండా అవినీతి పరులైన రాజకీయ నాయకులు యజ్ఞాలు, యాగాలు పేరుతో ప్రజాధనాన్ని వ్యర్థపరుస్తున్నా విద్యావంతులు, పాత్రికేయులు, శాస్త్రవేత్తలు ఎవరూ ప్రశ్నించటంలేదు. ఎవరో కొద్దిమంది సామాజిక స్పృహ ఉన్నవారు తప్ప. పైగా చాలామంది విద్యావేత్తలు, పాత్రికేయులు ఆయా యాగాల్లో యజ్ఞాల్లో పాల్గొంటున్నారు.

పూర్వం గ్రామాలకే పరిమితమైన ముక్కోటి గ్రామ దేవతలు పట్టణాలకు కూడా ఎగబాకారు. ఏ పుట్టలో ఏముందో ఎవ్వరికి మొక్కితే ఏం మంచి జరుగుతుందో ఆనే ఆలోచనతో మూఢ నమ్మకాలకి బానిసలవుతున్నారు. ఈ గ్రామదేవతల జాతరలపేరుతో ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. శాస్త్ర జ్ఞానంతో ప్రభావితులైన విజ్ఞుల అభిప్రాయాలు కొద్దిమంది ఆలోచనా పరులకు తప్ప మెజారిటీ ప్రజానీకానికి చేరటంలేదు. ఇప్పుడు సమస్య ఈ శాస్త్రవిజ్ఞానం ప్రజలకు చేరేదెలా? ప్రజలను ఆలోచింపచేసేదెవరు? ప్రజలను విజ్ఞానం వైపు నడిపించటానికి. వామపక్షాలు, అభ్యుదయవాదులు కలిసికట్టుగా ఉద్యమించాలి. నేడు మత తత్వముతో దేశాన్ని ముంచెత్తి, నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. సమాజాన్ని అభ్యుదయ పథంవైపు నడిపించాల్సిన యువతకు కనువిప్పు కలిగించాలి.

కనపర్తి జ్యోత్స్న

లాటిన్ అమెరికాలో వామపక్షం బలోపేతం

నిత్య చక్రవర్తి

బ్రెజిల్ అధ్యక్షుడిగా వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వ విజయం సాధించడంతో లాటిన్ అమెరికాలో వామపక్షం మరింత బలోపేతం అయింది. ఈ ప్రాంతంలో రాజకీయ వామపక్ష భావజాలం మరింతగా విస్తరించనున్నది. అక్టోబరు 30 వ తేదీ జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఇంత వరకు అధ్యక్షుడిగా ఉన్న పచ్చి మితవాది బోల్సనారొపై లూలా విజయం సాధించారు. లులాకు 50.90 శాతం ఓట్లు రాగా బోల్సొనారొకు 49.10 శాతం ఓట్లు లభించాయి. లూల విజయాన్ని ఎన్నికల అధికారులు ధృవీకరించారు. లూల గెలిస్తే తాను అంగీకరించబోనని బోల్సనారొ ప్రకటించినప్పటికీ తన ఓటమిని చివరికి అంగీకరించారు. రెండు ప్రత్యర్థి వర్గాల మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. ఎన్నికల ప్రచారంలో ఘర్షణలు జరిగాయి. మితవాద తీవ్రవాదులు జరిపిన కాల్పుల్లో అనేక మంది మరణించారు. బోల్సనారొ వర్గం అల్లర్లకు పాల్పడుతుందని మొదట ప్రజలు ఆందోళన చెందినప్పటికీ ప్రశాంతత నెలకొనడంలో ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యేకించి పట్టణాలు, నగరాల్లో ఎన్నికల సమయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

గత నాలుగేళ్ల కాలంలో దక్షిణ అమెరికా దేశాల్లో ఈక్వెడార్‌లో మినహా ఇతర అన్ని దేశాల్లో వామపక్ష మధ్యేవాద ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంత దేశాలన్నీ అమెరికా ఆధిపత్య, సామ్రాజ్యవాద విధానాలను వ్యతిరేకిస్తాయి. 2018 లో మెక్సికోతో వామపక్ష విజయం ప్రారంభమైంది. అనంతరం బొలీవియా, నికరాగ్వా, అర్జెంటైనా, చిలీ, పెరూ, కొలంబియా దేశాల్లో వామపక్షాలు ఎన్నికల్లో గెలుపొందాయి. తాజాగా బ్రెజిల్ వామపక్షం ప్రభుత్వాల జాబితాలో చేరింది. ఈ ప్రభుత్వాలు అనుసరించే పద్ధతులు, అమలు చేసే కార్యక్రమాలు, ప్రణాళికల్లో తేడాలుంటాయి. అయినప్పటికీ ఆర్థిక సహకారం మరింతగా విస్తరిస్తుంది. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని అమలు చేయడం ద్వారా అమెరికా బహుళజాతి సంస్థల సంకెళ్ల నుంచి విముక్తి పొందడానికి అవకాశం కలిగింది.

ఈ దేశాలన్నీ అపారమైన ఖనిజ సంపదను కలిగి ఉన్నాయి. అన్ని దేశాలు సహకరించుకొని అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించడానికి మార్గం సుగమమైంది. లూలా గతంలో రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి ప్రజోపయోగమైన కార్యక్రమాలను అమలు చేసి అత్యధిక ప్రజల, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ పొందారు. అనంతరం ఏర్పడిన పచ్చిమితవాద,

లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వ

అమెరికా అనుకూల ప్రభుత్వాలు కుట్ర పన్ని లూలాపై అవినీతి ఆరోపణల కేసు బనాయించి జైలుకు పంపాయి. 580 రోజులు జైలులో ఉన్నారు. విచారణ జరిపిన కోర్టు లూలపై చేసిన ఆరోపణలన్నీ అల్లిన కట్టుకథలేనని తీర్పు చెప్పింది. లూలా నిర్దోషిగా కోర్టు తేల్చింది. జైలు నుంచి విడుదలయ్యాక మళ్లీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి నిర్ణయించుకొని ప్రకటించారు. కోవిడ్-19 మహమ్మారిని నియంత్రించడంలోనూ, , రోగులకు వైద్య సేవలు అందించడంలోనూ బోల్సనారొ విఫలం కావడంలో ప్రజాదరణ కోల్పోయారు. అయినప్పటికీ దాదాపు 49 శాతం ఓట్లు తెచ్చుకోవడం పరిశీలకులకు ఆశ్చర్యం కలిగించింది.

లూలా ఖనిజ గనిలో పనిచేసే కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడి యూనియన్ నాయకుడిగా ఎదిగారు. ఆయన పాలనా కాలంలో బ్రెజిల్ అభివృద్ధి బాట పట్టింది. ప్రస్తుతం బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థ చాలా బలహీనంగా ఉంది. బ్రెజిల్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడికి అన్ని అధికారాలుంటాయి. అయితే దిగువ సభలో మితవాద పక్షానికి ఆధిక్యత ఉన్నది. అందువల్ల లూలా తీసుకునే చర్యలను అడ్డుకునే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. లూల పేదల, కార్మికుల దీన జనుల పక్షపాతి అని అందరికీ తెలిసిందే. అందువల్ల ఇతర పక్షాల నుంచి కొందరిని చేర్చుకొని సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసి బోల్సనారొ పక్షం నుండి ఎదురయ్యే అడ్డంకులను అధిగమించవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ముందుగా దేశంలో శాంతి భద్రతను పునరుద్ధరించవలసి ఉంది. తర్వాత ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలి. లూలా గతంలో రెండు సార్లు అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో అనుభవం పొందిన ఆర్థికవేత్తల గ్రూపు ఒక ప్రణాళిక ముసాయిదాను ఇప్పటికే తయారుచేసింది. ప్రజల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు తగిన కార్యక్రమాన్ని అమలు చేయడానికి ముసాయిదాను రూపొందించారు. ఆర్థిక రంగంలోని కీలక విభాగాలలో ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు కార్యక్రమాన్ని తయారుచేశారు. కరోనా మహమ్మారి నుండి తిరిగి వివిధ రంగాలు క్రమంగా పుంజుకుంటున్నాయి. అయినప్పటికీ నిరుద్యోగం రేటు 2022 సెప్టెంబరు నాటికి 8.9 శాతం ఉన్నది.

దక్షిణ అమెరికాలో బ్రెజిల్ అతి పెద్ద దేశం కాగా ప్రపంచంలో 5 వ పెద్ద దేశం. అట్లాంటిక్ మహాసముద్ర తీరంలో 4,500 మైళ్లు విస్తరించిన దక్షిణ అమెరికా ఖండంగా త్రికోణాకారంలో విలసిల్లుతున్నది. చిలీ, ఈక్వెడార్ మినహా తక్కిన అన్ని దక్షిణ అమెరికా దేశాల సరిహద్దులు కలిగి ఉన్నది. ప్రపంచంలోనే అతి పెద్ద అడవి అమెజాన్‌తో సహా అనేక దట్టమైన అడవులకు ఈ దేశం ప్రసిద్ధి. అనేక మెట్ట భూములు, కొండలు పైన్ పండ్లు పండే అటవీ ప్రాంతాలు, విస్తారమైన వరి పండే భూములు సుదీర్ఘమైన తీర మైదాన ప్రాంతం ఈ దేశానికి సంపద. బ్రెజిల్ ఉత్తర ప్రాంతంలో అమెజాన్ నది దాని చుట్టూ అడవులు విస్తరించి ఉన్నాయి. గత దశాబ్ది కాలంగా దేశ జిడిపి వృద్ధి సగటున 0.3 శాతం మాత్రమే ఉంది. అనేక సానుకూలమైన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఉత్పాదకత బలహీనంగానే ఉన్నది. బహుళ పన్నుల విధానం సరైన భౌగోళిక వాతావరణం లేకపోవటం, పరిశ్రమలకు ప్రోత్సాహం లేకపోవటం, మానవ వనరుల సమీకరణ నెమ్మదిగా ఉండటం, తక్కువ పొదుపు, అత్యధిక పెన్షన్లు తదితర అనేక అంశాలు ఉత్పాదకత తక్కువగా ఉండటానికి కారణం.

కోవిడ్-19 మహమ్మారి వల్ల మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నది. 2021 మధ్యకాలంలో వ్యాక్సిన్ పంపిణీ అవినీతిమయమైంది. ప్రజా జీవనం దాదాపు సాధారణ స్థితికి రావటానికి చాల సమయం పట్టింది. 2022 సెప్టెంబరులో మాత్రమే దేశంలో 86.8 శాతం ప్రజలకు వ్యాక్సిన్ మొదటి డోసు ఇవ్వగలిగారు. 2023 జనవరి 1 వ తేదీన లూలా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కొరడాదెబ్బలు తిన్న ముఖ్యమంత్రి...!

ఇ-మెయిల్

మొన్న దీపావళి వెళ్లిన మరుసటిరోజు ఛత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రి భూపేష్ భఘేల్ తనకు జీవితంలో వెలుగులు నిండుతాయని, దుర్గ్ జిల్లాలో జరిగిన ఒక పండగ కార్యక్రమంలో కొరడా దెబ్బలు తిన్నాడు. ఒకమనిషి జీవితంలొ ముఖ్యమంత్రి పోస్ట్ కంటే ఇంకా ఏమి వెలుగులు నింపే పోస్టు వస్తది ? ప్రధానమంత్రో లేక రాష్ట్రపతో కావాలేమో! చెప్పుతో కొట్టించుకుంటే జీవితంలో వెలుగులే వెలుగులు అని ఎవరయినా చెపితే చెప్పుతో కూడా కొట్టించుకుంటాడేమో? ఇలాంటి మూఢనమ్మకాలున్న వ్యక్తులు ముఖ్యమంత్రులుగా అయితే సమాజం ఏమి బాగుపడుతుంది? తల తెగిపోయిన వినాయకునికి, ఏనుగుతల అతికించటాన్ని సమర్థించిన ప్రధానమంత్రి ఉన్నదేశంలో, కొరడాదెబ్బలుతింటే జీవితంలో వెలుగులు నిండుతాయి అనుకునే ముఖ్యమంత్రి ఉండటంలో ఆశ్చర్యం లేదు!! మొన్నీమధ్య దిల్లీలో అధిక సంపద వస్తుందని ఒక బాలుడ్ని బలి ఇచ్చారు. అదే రకమైన ఆశతో కేరళలో ఇద్దరు మహిళలను నరికిచంపి తిన్నారు. పరలోకప్రాప్తి కోసం ఒక ఫాస్టర్ చెప్పాడని ఆమధ్య తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు మహిళలు ఉరివేసుకుని చనిపోయారు. తమిళనాడులో ఒకడు ఆత్మను చూడటానికి ఇద్దరు వ్యక్తులను చంపాడు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రికి, పైన పేర్కొన్న వ్యక్తుల ఆలోచనలకు తేడా ఎమిలేదు. మూఢ నమ్మకాలకు పదవులు అడ్డురావు.

"తివిరి ఇసుమన తైలంబు తీయవచ్చు...జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు"

"ఎలిక తోలుదెచ్చి ఎంతెంత ఉతికినా నలుపు నలుపేకాని తెలుపురాదు"

"కుక్కతోకకు రాయికట్టినా దాని వంకరపోదు అన్నట్లుగా..."

ఎంతపదవులు అలంకరించినా కూడా వారి మూఢ నమ్మకాలు పోవు అనేదానికి ఇవన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

హేతువాద అలోచన, హేతువాద ఉద్యమ ఆవశ్యకత ఈ సమాజానికి ఎంతో అవసరం ఉంది.

నార్నె వెంకటసుబ్బయ్య

పట్టభద్రుల నిర్లిప్తత దేనికి సంకేతం

సురేష్‌బాబు
కన్వీనర్, ఎన్నికల నిఘా వేదిక

గత నెల రోజుల నుంచి శాసనమండలి ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుంది కేవలం పదిహేను శాతం మంది ఓటు నమోదు చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో సామాన్యుడి ఆయుధం ఓటు. బ్యాలెట్ పోరు వచ్చిన ప్రతిసారీ వినిపించే మాట ఇది. నిజంగా సామాన్యుడు ఈ ఆయుధాన్ని ఎంతవరకు వినియోగించుకుంటున్నాడు? విద్యావంతులు మాత్రమే ఓటర్లుగా ఉండే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు ఓటరు నమోదు మందకొడిగా సాగుతుండడంతో అభ్యర్థులలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఏనభై శాతం పైగా ప్రజలు ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోలేదంటే ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. అలాగే ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు ఎన్నికల సమయంలోనూ ఆశించిన స్థాయిలో పోలింగ్ నమోదు కాకపోవడం ఒకవంతైతే, ముఖ్యంగా విద్యావంతులు పోలింగ్ రోజు గడప దాటి బయటకు రాకపోవడమనేది ప్రతిసారి జరుగుతున్నదే. ఈ క్రమంలో పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలోనూ ఇదే తంతు కొనసాగుతుండటంతో అందరినీ ఆందోళనకు గురి చేస్తుంది. ఇందుకు గతంలో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ నిదర్శనం. గత ఎన్నికల సమయంలో 42 శాతం, 45 శాతం, 49 శాతం పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకున్నారు. గతంలో హైదరాబాద్ జిల్లాలో అతి తక్కువగా 29 శాతం మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మిగిలిన వారు పోలింగ్ కేంద్రాల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఓటింగ్ రోజు శెలవు కావడంతో సుదూర ప్రాంతాలకు విహార యాత్రలకు పనికట్టుకొని వెళ్లడం జరుగుతున్న తంతు. అసలు ప్రధాన పార్టీల దిగజారుడు రాజకీయాల వల్లే ఓటర్లు రాజకీయాలంటే అసహ్యించుకునేలా తయారయ్యాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో ఉంటున్నా ఓట్లు గల్లంతు కావడం, ప్రతి ఎన్నికలకూ ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రహసనంగా మారుతోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు ఓటు వేయడానికి బద్ధకిస్తున్నట్లు తెలుస్తోంది. పోలింగ్



సందర్భంగా ఇచ్చిన హాలిడేని ఎంజాయ్ చేయడానికి బంధువుల ఊళ్లు వెళుతున్నారు. కొన్ని సందర్భాలలో వరుససెలవులు రావడం కూడా ఓటింగ్ శాతం పడిపోవడానికి బలమైన కారణంగా కనిపిస్తోంది. ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజలందరూ సంసిద్ధులుకావాలి. ప్రజాభిప్రాయానికి విలువ లేకపోవడం, అదే సమయంలో డబ్బుకు ప్రాధాన్యత పెరగడం కూడా సగటు ఓటరు ఓటు వేయకపోవడానికి కారణంగా తెలుస్తోంది. తాను ఓటు వేసిన వ్యక్తి విజయం సాధించాక వ్యాపారం కోసమే, ఇతర రాజకీయ ప్రయోజనాల కోసమే తాను వ్యతిరేకించే పార్టీలో చేరితే ఇక తన ఓటుకు విలువెక్కడదని ఓటరు ప్రశ్నించుకుంటున్నాడు.

చదువుకున్న వ్యక్తులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే దేశం మనుగడ ఎలా సాధిస్తుంది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అధికార, విపక్షాలపై విశ్వాసం సన్నగిల్లటం కూడా ఓటింగ్ శాతం తగ్గటానికి కారణంగా చెప్పుకోవచ్చు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది రాయి. ప్రజలు నిర్మించుకున్న వ్యవస్థ మార్పుకై సమర్థవంతమైన వ్యక్తిని నాయకునిగా నిలబెట్టడానికి తమ అభిప్రాయాన్ని ఓటు హక్కు అనే ఆయుధం ఉపయోగిస్తూ ఎన్నికల్లో గెలిపించి చట్టసభల్లోకి పంపాలి. అనగా ఒక వ్యవస్థ నిర్మించడానికైన, కూల్చడానికైన సామాన్య ప్రజానీకంలో ఉన్న ఏకైక ఆయుధం 'ఓటు హక్కు', దేశ చరిత్రలో ఇది ఒక కీలక మైలురాయి.

ఆంగ్లేయుల కాలంలో పరిమిత ప్రాతిపదికన భారతీయులకు కల్పించిన ఓటు హక్కును ధనిక, పేద, కులము, మతము, లింగం అనే తేడా లేకుండా రాజ్యాంగం ద్వారా సార్వత్రిక వయోజన ఓటు హక్కును రాజ్యాంగం ద్వారా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతీయ పౌరులందరకి కల్పించడం జరిగింది. ఆగస్టు 15, 1947 లో ఆంగ్లేయుల కబంధ హస్తాల నుండి ఈ దేశానికి స్వాతంత్ర్యం రాగా, జనవరి 26, 1950 లో కులము, మతము, లింగము అనే చారిత్రక అడ్డుగోడలకు చరమగీతం పాడి మనుషులకు స్వతంత్రం సిద్ధించింది. తద్వారా రాజ్యాధినేతను ఎన్నుకొనే గణతంత్ర వ్యవస్థకు పునాది వేసింది గొప్ప భారత రాజ్యాంగం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ఆర్టికల్ 19(1) ఎ ప్రకారం ఓటు అనేది రాజ్యాంగబద్ధ ప్రాథమిక హక్కుగా భారత రాజ్యాంగంలో పేర్కొని ఒక ఓటు ఒక విలువతో సమానత్వం ప్రస్తావించడం జరిగింది.

భారతదేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకుని పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పిస్తామని రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న రాజ్యాంగ అంతర్లీన సూత్రాన్ని పీఠిక ద్వారా ప్రజలకు అందించారు. భారతదేశంలో కులము, మతము, లింగము అనే చారిత్రక అడ్డుగోడలను కూకటివేళ్లతో కూల్చేసిన పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం. రాజ్యాంగం ద్వారా 'ఒక ఓటు ఒక విలువ' రాజకీయ వ్యవస్థలో సాకారం అయినప్పటికీ సామాజిక, ఆర్థిక వ్యవస్థ నేటికి సాకారం కావడం లేదు. అంబేద్కర్ భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ప్రవేశపెట్టి మన తలరాతను మార్చిన గొప్ప వ్యక్తి. ప్రజల సామాజిక, ఆర్థిక, అసమానతలు లక్ష్యంగా చేసుకొని నేడు రాజకీయ పార్టీల అభ్యర్థులు ఓటర్లకు ఎరవేస్తూ సామాన్య ప్రజానీకం ఓటు అనే ఆయుధాన్ని చిదిమేస్తున్నారు. ధన ప్రవాహం ద్వారా గెలిచిన అభ్యర్థులు అవినీతి వైపు వెళుతూ సామాన్య ప్రజానీకం గొంతుకు తాళం వేసి అంధకారంలోకి నెడుతున్నారు. ప్రపంచంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ దేశాలు వేగవంతమైన అభివృద్ధి వైపు ప్రయాణిస్తుంటే, గడిచిన 75 వసంతాలు స్వతంత్ర భారతదేశం నేటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోక, కులము, మతము, వర్గం అనే తారతమ్యాలతో కొట్టుమిట్టాడడం జరుగుతుంది. అదేవిధంగా ధన బలం, అధికార బలంతో పరిపాలనను హస్తగతం చేసుకొని, చట్టసభల్లో వెళ్లి ప్రగతిశీల చట్టాలకు పాతరేసి భారత రాజ్యాంగాన్ని సంక్షోభంలోకి నెట్టడం జరుగుతుంది.

చెన్నైని ముంచెత్తిన వర్షం

- గోడలు కూలి ఒకరు, విద్యుదాఘాతంతో మరొకరు మృతి
- ఆరెంజ్ అలర్ట్ జారీ

చెన్నై: చెన్నై నగరాన్ని వర్షం ముంచెత్తింది. వర్ష సంబంధిత ఘటనల్లో ఇద్దరు మరణించారు. వారాంతానికి ఈశాన్య రుతుపవనాలు తమిళనాడుకు రావడంతో చెన్నైలో వరుసగా రెండవ రోజు కూడా తీవ్రమైన వర్షం కొనసాగింది. ఎడతెరిపి లేని వర్షం ప్రజల సాధారణ జీవితాన్ని ప్రభావితం చేసింది. చెన్నై నగరంలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. రాబోయే కొన్ని గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ వాతావరణ విభాగం ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. మంగళవారం ఉదయం 47 ఏళ్ల మహిళ పై తన ఇంటి బాల్కనీ నుంచి గోడ ఒక భాగం పడటంతో ఆమె మరణించింది. పులియంతోప్‌లోని ప్రకాష్‌రావు కాలనీకి చెందిన శాంతి అనే మహిళ ఆమెను గుర్తించారు. తన ఇంటి బయట నిలబడి కార్పొరేషన్ నీటిని పడుతుండగా గోడ ఆమె పై పడింది. దీంతో శాంతి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. పులియంతోప్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి ఇల్లు పాతదని, గోడ కూలిపోయిందని ప్రాథమిక విచారణలో తేలింది. మరో సంఘటనలో, సోమవారం వ్యాసర్పాడిలో లైవ్ వైర్‌కు తగిలి 52 ఏళ్ల ఆటో డ్రైవర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. మద్యం మత్తులో ఉన్న దేవేంద్రన్ అనే వ్యక్తి సోమవారం రాత్రి వ్యాసర్పాడిలోని బీవీ కాలనీలో ఉన్న తన ఇంటికి తిరిగి వస్తున్నాడు. అతను తన వీధిలో నిలిచిపోయిన మోకాళ్లలోతు వర్షపు నీటిలో నడుస్తుండగా, తన ఇంటి సమీపంలో నిర్మించిన టెంట్ స్తంభానికి తాకాడు. సమీపంలోని ఈబీ బాక్స్‌లోని లైవ్ వైర్‌కు స్తంభం తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంకేబీ నగర్ పోలీసులు అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. తదుపరి విచారణ కొనసాగుతోంది. కాగా, బుధవారం ఉదయం వరకు చెన్నైతోపాటు పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. చెన్నైలోని అన్ని వార్డులకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. చెన్నైతో పాటు పొరుగున ఉన్న తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పేట జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం వాతావరణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.బాలచంద్రన్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా మంగళవారం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్ పేటలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ముఖ్య మంత్రి ఎం.కె.స్టాలిన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల పరిస్థితిని సమీక్షించారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల కాలంలో తమిళనాడులో 35 శాతం నుంచి 75 శాతం మిగులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిందని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే 43 డ్యామ్‌లలో నీటి నిల్వ స్థాయి 75 శాతం నుంచి 100 శాతానికి చేరుకుందని, 17 డ్యామ్‌లలో 50 శాతం నుంచి 75 శాతం వరకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కె.కె.ఎస్. ఎస్.ఆర్.రామచంద్రన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి ఇరై అన్బు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా మంగళవారం ఉదయం 8.30 గంటల సమయానికి తిరువళ్లూర్‌లోని రెడ్ హిల్స్‌లో 13 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయింది. చెన్నై నగరంలోని పెరంబూర్‌లో 12 సెం.మీ, చెన్నై కలెక్టరేట్ భవనంలోని వాతావరణ కేంద్రం, తొండియార్‌పేట, విల్లివాక్కం, పొన్నేరిలో 10 సెం.మీ వర్షపాతం నమోదయింది. అలాగే నుగంబాక్కం, డీజీపీ కార్యాలయం, నందనమ్, అన్నా విశ్వవిద్యాలయం సహా ఇతర ప్రాంతాల్లో 6 నుంచి 8 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. తొండియార్‌పేట్, మడిపాక్కం, తిరువొత్తియూర్, మనాలి, పల్లికరణై, వెలచ్చేరి, అరుంబాక్కం, ఎక్కుటుతంగల్, కేకే నగర్, ఎగ్మోర్ తదితర ప్రాంతాల్లో సోమవారం నుంచి భారీ వర్షం కురుస్తోంది. గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. అలాగే చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్‌పట్టు, విల్లుపురం, తిరువళ్లూరులో ఉరుములతో కూడిన గాలివానతో పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం మంగళవారం హెచ్చరించింది. నీలగిరి, మైలాడుతురై, కడలూరు, తిరుపత్తూరు, కరూర్, రాణిపేట్, వేలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. చెన్నై, శ్రీహరికోట మధ్య అనుకూలమైన పరిస్థితులలో కోస్తా తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం పేర్కొంది.

వీధుల్లో నిలిచిన వర్షం నీరు... తోడేస్తున్న ప్రజలు

లోతట్టు ప్రాంతాలు, దక్షిణ చెన్నై నివాసితులకు ఇప్పటికే నిర్దిష్ట హెచ్చరికలు జారీ చేశారు. రాత్రిపూట భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, మంగళవారం నాటికి చెన్నైలోని అనేక లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లలో వర్షం నీరు ప్రవహిస్తున్నట్లు సమాచారం. గత ఏడాది కురిసిన వర్షాలకు నీటమునిగిన బుర్కిత్ రోడ్డు, నార్త్ ఉస్మాన్ రోడ్డు, జీఎన్ చెట్టి రోడ్డు మంగళవారం నీట మునిగింది. కాగా మురికినీటి కాలువలు (ఎస్‌డబ్ల్యూడీ) ఇంకా పూర్తికాని ప్రాంతాల్లో నగర కార్పొరేషన్ పంపులను కూడా మోహరించింది. ఎస్‌డబ్ల్యూడీ పనులు కొనసాగుతున్న చోట్ల నీటిని తోడేందుకు సోమవారం రాత్రి నుంచి పనులు చేపట్టామని పంప్ ఆపరేటర్లు తెలిపారు.

ఏడు రాష్ట్రాల్లో ఆవిర్భావ దినోత్సవం

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: దేశంలో ఏడు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు మంగళవారం ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాల ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలైన లక్షద్వీప్, పుదుచ్చేరితో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలు వేర్వేరు సంవత్సరాల్లో నవంబరు 1న ఏర్పడ్డాయి. దేశంలో మొత్తం 28 రాష్ట్రాలతో పాటు ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్ 1956లో ఆవిర్భవించగా, పంజాబ్, హరియాణా 1966లో ప్రత్యేక రాష్ట్రాలుగా విభజించబడ్డాయి, ఛత్తీస్‌గఢ్‌కు 2002లో రాష్ట్ర హోదా లభించింది. 1956లో మొదటిసారిగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం భాష ప్రాతిపదికన అనేక రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. 'ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, లక్షద్వీప్, పుదుచ్చేరి ప్రజలకు వారి రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు... ఈ ప్రాంత నివాసితుల అభివృద్ధి, సౌభాగ్యం కోసం కోరుకుంటున్నాను' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. ఆవిర్భావదినోత్సవం జరుపుకుంటున్న రాష్ట్రాలు అన్ని విధాలుగా అత్యున్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నట్లు ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ట్వీట్ చేశారు.

ఎస్‌పీ నేత, కుటుంబ సభ్యుల దారుణహత్య

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సతారా గ్రామంలో సమాజ్‌వాదీ పార్టీ నేత, అతని భార్య, తల్లిని గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన బదౌన్ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ప్రమేయం ఉన్నట్టు అనుమానిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేయగా, ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ ట్రిపుల్ మర్డర్ సోమవారం చోటుచేసుకుంది. మృతులను సమాజ్‌వాద్ పార్టీ మాజీ బ్లాక్ చీఫ్ రాకేశ్ గుప్తా (58), అతని భార్య శారదా దేవి (54), తల్లి శాంతిదేవి (80)గా గుర్తించారు. రాజకీయ శత్రుత్వమే ఈ హత్యలకు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, మూడు హత్యల ఘటనపై తమకు సోమవారం సాయంత్రం 6 గంటలకు సమాచారం అందినట్టు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పీ) ఓపీ సింగ్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై వచ్చి గుప్తా ఇంటి వెనుక వైపు నుంచి లోపలికి చొరబడినట్టు చెప్పారు. గుప్తాపైన, ఆయన కుటుంబ సభ్యులపైన విచక్షణారహితంగా కాల్పులు జరిపి పరారైనట్టు చెప్పారు. గుప్తా, ఆయన కుటుంబ సభ్యులు ఇద్దరిని అగంతకులు కాల్చిచంపిన ఘటనపై యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను సమాజ్‌వాదీ పార్టీ తప్పుపట్టింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

సల్మాన్, అమృత ఫడ్నవీస్‌కు భద్రత పెంపు

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాలీవుడ్ స్టార్‌లు సల్మాన్‌ఖాన్, అక్షయ్ కుమార్‌లకు భద్రత కల్పించింది. నటుల కుటుంబాలకు పొంచి ఉన్న ప్రమాదంపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సల్మాన్‌కు వై+ గ్రేడ్ భద్రతను కల్పించగా.. అక్షయ్‌కుమార్‌కు × కేటగిరీ భద్రత కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లో ప్రముఖ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్యోదంతంలో నిందితుడిగా భావిస్తున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి సల్మాన్‌కు వచ్చిన బెదిరింపులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆయనకు ప్రస్తుతం ఉన్న ఎక్స్ గ్రేడ్ భద్రతను వై+గా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఇద్దరు సాయుధ గార్డులు సల్మాన్‌కు అనునిత్యం భద్రతగా ఉండనున్నారు. ఇంటి వద్ద కూడా ఇద్దరు భద్రతా సిబ్బంది నిత్యం పహారా కాస్తారు. అక్షయ్ కుమార్‌కు వై.కేటగిరీ భద్రత కింద మూడు షిఫ్ట్‌లలో ముగ్గురు భద్రతా అధికారులు రక్షణగా ఉండనున్నారు. ఇంకోవైపు, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సతీమణి అమృత ఫడ్నవీస్‌కు రాష్ట్ర ప్రభుత్వం వై.ప్లస్ భద్రత కల్పించింది.

షిండే వర్గ ఎమ్మెల్యేలు, ఎంపీలకు వై ప్లస్...

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన 41 మంది ఎమ్మెల్యేలు, 10 మంది ఎంపీలకు వై ప్లస్ భద్రతను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిన్న నిర్ణయించిన విషయం తెలిసిందే. కొత్త సర్కారు ఏర్పడిన మూడు నెలల తర్వాత కూడా ఈ స్థాయి భద్రతను కొనసాగించడం గమనార్హం. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహావికాస్ అఘాడీ(శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కూటమి) నాయకులు 25 మందికి 'కేటగరైజ్డ్ భద్రత'ను తొలగించింది. అయితే, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుటుంబ సభ్యులకు, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఆయన కుటుంబ సభ్యులకు కేటాయించిన భద్రతలో మార్పు చేయలేదు.

తీగల వంతెన దుర్ఘటనపై సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని మోర్బీ నగరం మచ్చు నదిపై తీగల వంతెన కూలిన దుర్ఘటనపై దర్యాప్తు జరిపించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ఘటనపై రిటైర్డ్ జడ్జీ నేతృత్వంలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి.. దర్యాప్తు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. దీనిపై నవంబరు 14న విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

గుజరాత్ సీఎం రాజీనామా చేయాలి: కేజ్రీవాల్

వంతెన కూలడం వెనక మానవ తప్పిదాలతో పాటు నిర్వహణ లోపాలు కూడా బయటపడుతున్నాయి. దీంతో ప్రతిపక్షాలు గుజరాత్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి. ఈ ఘటనపై జ్యుడిషియల్ దర్యాప్తు చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఘటనపై తీవ్రంగా స్పందించారు. ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగిపోయి ఎన్నికలకు వెళ్లాలన్నారు.

చమురు కొనకపోతే...

ధరలు పెరుగుతాయ్

కేంద్రమంత్రి వింత సమాధానం

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై దాడికి దిగిన రష్యాపై అంతర్జాతీయస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నప్పటికీ భారత్ ఆ దేశం నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది. దీనిపై ఎలాంటి నైతిక ఘర్షణ లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు. ఈ చమురు కొనుగోలు చేయకపోతే.. ధరలు పెరుగుతాయని అబుదాబిలో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'మేం మా వినియోగదారులకు మాత్రమే నైతిక బాధ్యత వహిస్తాం. మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. మాది ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. భారత్ తన అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే విషయంలో ఎలాంటి నైతిక ఘర్షణ లేదు. మేము చమురు అందుబాటులో ఉన్న దేశాల నుంచి కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం ఆ పని చేయకపోతే.. సంస్థలు చేస్తాయి' అని వెల్లడించారు. 'భారత్‌కు చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో రష్యా నాలుగు లేక ఐదు స్థానాల్లో ఉంటుంది. ఈ విషయంలో ఇరాక్ మొదటిస్థానంలో ఉంది. ఎవరూ రష్యా చమురు కొనుగోలు చేయకపోతే.. ధరలు పెరిగిపోతాయి. ధరలు పెరిగితే.. ద్రవ్యోల్బణం ఆ తర్వాత మాంద్యం ముంచుకొస్తుంది' అని పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతి తగ్గించమని అమెరికా లేక ఐరోపా యూరోపియన్ యూనియన్ భారత్‌ను కోరితే..? అని ఆ విలేకరి ప్రశ్నించగా.. 'ఆ ప్రశ్నను అమెరికా లేక యూనియన్‌ను అడగండి' అని కాస్త ఘాటుగా బదులిచ్చారు. యుద్ధం వేళ పుతిన్ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధిస్తున్నాయి. ఇదే తరహాలో రష్యా చమురు ధరలపై పరిమితులు విధించడం గురించి జీ7 దేశాలు మాట్లాడుతున్నాయి. దీనిపై ఇంతవరకు ఎలాంటి నిర్ణయమూ వెలువడలేదు. అయితే అలాంటి ప్రతిపాదన ఉంటే.. భారత్ పరిశీలిస్తుందని మంత్రి వెల్లడించారు. చమురు కొనుగోలు విషయంలో తమ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని మొదటి నుంచి భారత్ తన వాదన వినిపిస్తోన్న సంగతి తెలిసిందే.

మన్‌గఢ్ ధామ్ అభివృద్ధికి కార్యాచరణ

- రాజస్థాన్, దాని పొరుగు రాష్ట్రాలను కోరిన ప్రధాని మోదీ
- గిరిజనుల అభివృద్ధికి స్పష్టమైన విధానంతో పని చేస్తున్న కేంద్రం

జైపూర్/మన్‌గఢ్: బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గిరిజనుల తిరుగుబాటు స్మారక చిహ్నమైన మన్‌గఢ్ ధామ్‌ను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని రాజస్థాన్‌తో పాటు పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం కోరారు. 'నవంబర్ 17, 1913న బ్రిటీషు వారు జరిపిన కాల్పుల్లో 1,500 మందికి పైగా ఆదివాసీలు మరణించారు. అయితే దురదృష్టవశాత్తూ, స్వాతంత్ర్యానంతరం వ్రాసిన చరిత్రలో దీనికి తగిన స్థానం ఇవ్వలేదు. ఇప్పుడు దేశం దశాబ్దాల క్రితం చేసిన తప్పును సరిదిద్దుతోంది' అని స్మారక చిహ్నం వద్ద గిరిజనులతో పాటు ఇతరులతో కూడిన ఒక సభలో ప్రసంగించారు. కాగా, 1913 తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గోవింద్ గురుని గుర్తు చేసుకుంటూ మోదీ మాట్లాడుతూ ఆదివాసీ నాయకుడి స్థానానికి ప్రపంచ గుర్తింపు వచ్చేలా రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కలిసి కేంద్రం నాయకత్వంలో ధామ్‌ను మరింత అభివృద్ధి చేయగలవని అన్నారు. మరికొద్ది వారాల్లో గుజరాత్‌లో, వచ్చే ఏడాది రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో గిరిజన సమాజానికి చేరువయ్యేందుకే బీజేపీ ఈ కార్యక్రమం ద్వారా ప్రయత్నించిందని భావిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో భిల్లులు, ఇతర తెగల సభ్యులు బ్రిటిష్ వారితో సుదీర్ఘ పోరాటంలో నిమగ్నమయ్యారు. 1913 నవంబర్ 17న గోవింద్ గురు నాయకత్వంలో 1.5 లక్షల మంది గిరిజనులు మన్‌గఢ్ హిల్‌కు ర్యాలీగా చేరుకున్నారని అధికారిక ప్రకటన తెలిపింది. స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీల సహకారాన్ని ఎత్తిచూపిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... రాజస్థాన్, గుజరాత్ నుంచి ఈశాన్య ప్రాంతాల వరకు దేశవ్యాప్తంగా గిరిజనుల అభివృద్ధికి కేంద్రం స్పష్టమైన విధానంతో పని చేస్తోందని అన్నారు. నీరు, విద్యుత్, ఆరోగ్యంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, అటవీ సంపదను కూడా పరిరక్షిస్తున్నామని, ఉపాధి అవకాశాలకు అనుసంధానం చేస్తున్నామని మోదీ చెప్పారు. మన్‌గఢ్ ధామ్‌ను అద్భుతంగా విస్తరించాలని మనందరికీ బలమైన కోరిక ఉందని, దీని కోసం రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ ఇటీవలే ప్రధాన మంత్రి రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ ముఖ్య కార్యదర్శులతో ధామ్ గురించి మాట్లాడడం సంతోషంగా ఉందన్నారు. 'దీని అర్థం ఇది మీ మనస్సులో ఉందని, మీ సందర్శనకు ముందు దాని గురించి మీకు సమాచారం ఉండాలని మీరు అనుకున్నారు. మన్‌గఢ్ ధామ్‌ను జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించాలని నేను మిమ్మల్ని మళ్లీ కోరుతున్నాను' అని తెలిపారు.

ఒకే వేదికపై మోదీ, గెహ్లాట్

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఒకే వేదిక పంచుకున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. తాము ముఖ్యమంత్రులుగా కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

ప్రధాని తన ప్రసంగంలో ముఖ్యమంత్రులుగా తాను, గెహ్లాట్ కలిసి పనిచేసిన విషయాన్ని ప్రస్తావించారు. 'మేము సీఎంలుగా ఉన్న సమయంలో గెహ్లాట్ సీనియర్. ఇప్పుడు వేదికపై ఉన్న సీనియర్ మోస్ట్ సీఎంలలో ఆయన ఒకరు' అని ప్రధాని అన్నారు. దీనికి ముందు గెహ్లాట్ తన ప్రసంగంలో మోదీ విదేశాలకు వెళ్లినప్పుడు ఆయనకు గొప్ప గౌరవం లభిస్తోందని అన్నారు. 'మోదీ విదేశాలకు ఎప్పుడు వెళ్లినా అక్కడ విశేష గౌరవం లభిస్తోంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం బలంగా వేళ్లూనుకున్న జాతిపిత గాంధీ పుట్టిన దేశానికి ఆయన ప్రధాని. అలాంటి దేశానికి ప్రధానిగా మోదీ తమ దేశం వచ్చినందుకు అక్కడి వారంతా గర్వపడుతుంటారు' అని గెహ్లాట్ అన్నారు.

ప్రధాని సందర్శన...అర్ధరాత్రి ఆస్పత్రికి అలంకరణ

గాంధీనగర్: గుజరాత్‌లోని మోర్బీ సివిల్ ఆస్పత్రిని రాత్రికి రాత్రే బీజేపీ నాయకులు, అధికారులు అలంకరణ పనులు చేపట్టారు. మోర్బీ వంతెన ఘటనలో గాయపడిన వారికి ఈ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. ప్రధాని మోదీ మంగళవారం వారిని పరామర్శించేందుకు ఆస్పత్రిని సందర్శించనున్నారన్న వార్తలతో అధికారులు అర్ధరాత్రి అలంకరణ పనులు చేపట్టారు. సోమవారం రాత్రి ఆస్పత్రిని సందర్శించిన ఎన్‌డీటీవీ బృందానికి అక్కడి దృశ్యాలు కంటబడ్డాయి. సీలింగ్‌కు పెయింట్లు వేయడం, కొత్త టైల్స్ అతికించడం, కొత్త వాటర్ కూలర్‌లు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నారు. కొత్త బెడ్ షీట్స్‌తో ప్రత్యేక వార్డులోకి గాయపడినవారిని మార్చడం, ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయించడం వంటి దృశ్యాలు కనిపించాయి. దీంతో ప్రధాని ఫొటోషూట్ కోసం ఆస్పత్రిని రెడీ చేయడంలో బీజేపీ అధికారులు బిజీగా ఉన్నారని కాంగ్రెస్, ఆప్ ఎద్దేవా చేశాయి. ప్రధాని సివిల్ ఆస్పత్రిని సందర్శించనుండటంతో... ఆస్పత్రి పెయింటింగ్, టైల్స్‌తో మెరిసిపోతుందని.. ప్రధాని ఫొటో షూట్ కోసం అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని కాంగ్రెస్ ట్వీట్ చేసింది. బీజేపీ అధికారులకు సిగ్గులేదని, దుర్ఘటనలో వందలాదిమంది మరణించగా, బీజేపీ మాత్రం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో బిజీగా ఉందని మండిపడింది. ప్రధాని ఫొటో షూట్‌లో ఎటువంటి లోపం లేకుండా ఉండేందుకు ఆస్పత్రిని మెరిపిస్తున్నారని ఆప్ ట్వీట్ చేసింది. 27 ఏళ్లలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సమర్థవంతంగా పరిపాలన నిర్వహించి ఉంటే అర్ధరాత్రి ఆస్పత్రిని అలంకరించాల్సిన అవసరం ఉండేది కాదని వ్యాఖ్యానించింది. ఆదివారం జరిగిన మోర్బీ తీగల వంతెన కూలిన ప్రమాదంలో 145 మంది మరణించిన సంగతి తెలిసిందే. వారిలో 47 మంది చిన్నారులు ఉన్నారు.

'ఆప్' నేతలకు భారీగా ముడుపులు!

- ఆర్థిక నేరస్థుడు సుకేశ్ సంచలన ఆరోపణలు
- దిల్లీ ఎల్జీకి లేఖ
- బీజేపీ కుట్రేనన్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీకి కోట్లాది రూపాయలు సమకూర్చానంటూ ఆర్థిక నేరస్థుడు సుకేశ్ చంద్రశేఖర్ సంచలన ఆరోపణలు చేశాడు. అనేకమంది ఉన్నతస్థాయి వ్యక్తులను రూ.200 కోట్ల మేర మోసం చేశాడన్న ఆరోపణలపై సుకేశ్ ప్రస్తుతం దిల్లీలోని మండోలి జైలులో ఉన్నాడు. జైల్లో తనకు రక్షణ కల్పిస్తానంటూ దిల్లీ మంత్రి సత్యేంద్రజైన్ తన నుంచి బలవంతంగా రూ.10కోట్లు వసూలు చేశారని ఆరోపించాడు. దీనిపై దర్యాప్తు సంస్థలకు ఫిర్యా దు చేశానని, అప్పటి నుంచి జైన్ తనను బెదిరిస్తున్నారని పేర్కొన్నాడు. ఈ మేరకు సుకేశ్... తన న్యాయవాది అశోక్ కె.సింగ్ ద్వారా అక్టోబరు 8న దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాశాడు. 2015 నుంచి సత్యేంద్రజైన్‌తో నాకు పరిచయం ఉందని, దక్షిణాదిలో నాకు కీలక పదవి అప్పగిస్తానని, పార్టీ విస్తరణ తర్వాత రాజ్యసభకు పంపుతామని ఆమ్ ఆద్మీ పార్టీ తనకు హామీ ఇచ్చిందని తెలిపాడు. ఇందుకు గాను ఆ పార్టీకి రూ.50కోట్లకు పైగా డబ్బు సమకూర్చినట్లు పేర్కొన్నాడు. 2017లో తాను అరెస్టయి తర్వాత తీహార్ జైల్లో ఉన్నప్పుడు దిల్లీ ప్రభుత్వంలో జైళ్లశాఖ మంత్రిగా ఉన్న సత్యేంద్ర జైన్ తనను కలిశారు... ఆమ్‌ఆద్మీ పార్టీకి ఇచ్చిన డబ్బు గురించి దర్యాప్తు సంస్థలకు ఏమైనా చెప్పావా? అని అడిగారని పేర్కొన్నాడు. 2019లో మరోసారి తాను అరెస్టయినప్పుడు కూడా సత్యేం ద్రజైన్ తన సెక్రటరీ, మరో సన్నిహితుడితో జైలుకు వచ్చి నన్ను కలిశారని, జైల్లో రక్షణ, ఇతర సదుపాయాలు కల్పించాలంటే ప్రతినెలా తనకు రూ.2కోట్లు కట్టాలని జైన్ డిమాండ్ చేసినట్లు సుకేశ్ ఆరోపించాడు. ఇదిగాక డీజీ(జైళ్లు) సందీప్ గోయెల్‌కు కూడా ప్రతినెలా రూ.1.5కోట్లు ఇవ్వాలని చెప్పారు...నాపై ఒత్తిడి పెంచి కొన్ని నెలలు బలవంతంగా కట్టించుకున్నారు... ఈ విధంగా సత్యేంద్ర జైన్‌కు రూ.10 కోట్లు, సందీప్ గోయల్‌కు రూ.12.5కోట్లు చెల్లించినట్లు సుకేశ్ ఆరోపించాడు. ఇటీవల ఈడీ దర్యా ప్తులో భాగంగా జైళ్లలో జరుగుతున్న దోపిడీ రాకెట్ గురించి తాను అధికారులకు చెప్పానని, దీనిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసినట్లు సుకేశ్ లేఖలో వివరించాడు. కాగా ప్రస్తుతం సత్యేంద్రజైన్ కూడా మనీ లాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి తీహార్ జైల్లోనే ఉన్నారు. పిటిషన్ గురించి తెలియగానే జైన్.. తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని సుకేశ్ ఆరోపించాడు. జైన్‌కు డబ్బులు ఇచ్చినట్లు తన వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని, దీనిపై విచారణ జరిపించేలా ఆదేశాలు ఇవ్వాలని దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరాడు. గతంలో ర్యాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్లు మల్విందర్ సింగ్, శివిందర్ సింగ్‌కు బెయిల్ ఇప్పిస్తానని నమ్మించి వారి భార్యల నుంచి ఏకంగా రూ.200 కోట్లు వసూలు చేసిన కేసులో సుఖేశ్ అరెస్టయిన విషయం తెలిసిందే.

దర్యాప్తు చేస్తాం: ఈడీ

సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపణలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పందించింది. దీనిపై దర్యాప్తు చేపడతామని, త్వరలోనే ఈ విషయాలపై సుకేశ్‌ను ప్రశ్నిస్తామని ఈడీ అధికారులు పేర్కొన్నారు. జైలు అధికారులకు సుకేశ్ లంచం ఇచ్చినట్లు గతంలో కూడా ఆరోపణలు వచ్చిన సంగతి విదితమే.

గుజరాత్ ఎన్నికలు, మోర్బీ ఘటన నుంచి దృష్టి మళ్లించేందుకే: కేజ్రీవాల్

ఆర్థిక నేరస్థుడు సుకేశ్ చంద్రశేఖర్ ఆమ్‌ఆద్మీపై చేసిన ఆరోపణలను దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. గుజరాత్ ఎన్నికలు, మోర్బీ విషాద ఘటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందన్నారు. 'గుజరాత్‌లోని మోర్బీ నగరంలో తీగల వంతెన కూలి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నిన్నటివరకు అన్ని టీవీ ఛానళ్లు ఇవే కథనాలను ప్రసారం చేశాయి. ఒక్కసారిగా ఆ వార్తలు కన్పిం చకుండా పోయి సుకేశ్ ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా చూస్తుం టే మోర్బీ ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కల్పిత కథనాలు సృష్టి స్తున్నారని స్పష్టమవుతోంది' అని కేజ్రీవాల్ అన్నారు. సుకేశ్ ఆరోపణలపై బీజేపీ స్పందిస్తూ... ఆప్ మహా దుష్టుల పార్టీగా అభివర్ణించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఆప్ ఒక దుండగుడితో గూండాయిజానికి పాల్పడిందని ఆరోపించారు. ఆప్ దుష్టుల పార్టీ అని ఆయన ఆరోపించారు.

వైఎస్ఆర్ సేవలు అపూర్వం

- కొనియాడిన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- మహనీయుల సేవలకు వందనం: సీఎం జగన్
- కన్నులపండువగా వైఎస్ఆర్ అచీవ్‌మెంట్-2022 అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దివంగత నేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి తనదైన పాలనతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ తెలిపారు. అలాంటి మహనేత పేరుతో అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరుసగా రెండో ఏడాది 'వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య-2022' పురస్కారాలను బహూకరించారు. విజయవాడలోని ఎ1 కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం కన్నుల పండువగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగి ఉందని, బహుళ ప్రతిభలు కలగలిసిన రాష్ట్రమన్నారు. కళలు, చేతివృత్తులు, కూచిపూడి నృత్యం ఇక్కడ ప్రసిద్ధి చెందాయని చెప్పారు. తెలుగు భాషకు వెయ్యేళ్లు పైబడ్డ చరిత్ర ఉందని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, గొప్ప వ్యక్తులు కలిగిన నేల ఆంధ్రప్రదేశ్ అని కొనియాడారు. దేశ చరిత్రలోనే వైఎస్సార్ అరుదైన నాయ కుడిగా నిలిచారన్నారు. 4 సార్లు ఎంపీ, 5 సార్లు ఎమ్మెల్యేగా పని చేశారని, ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నరుతో కలిసి వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 35 మంది వ్యక్తులకు, సంస్థలకు 30 అవార్డులను బహూకరించారు. వ్యవసాయం, కళలు, సంస్కృతి, సాహిత్యం, మహిళా శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమలు వంటి రంగాలలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు, 20 వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, 10 వైఎస్సార్ అచీవ్ మెంట్ అవార్డులు అందజేశారు. వైఎస్ఆర్ జీవిత సాఫల్య అవార్డు కింద రూ.10లక్షల నగదుతోపాటు వైఎస్ఆర్ కాంస్య విగ్రహం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, వైఎస్ఆర్ సాఫల్య అవార్డుకు రూ.5లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... 'మహనీయుల సేవలకు వందనం... అసామాన్య సేవలు అందిస్తున్న మానవతా మూర్తులకు వందనం' అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వెనకబాటు, అణచివేత, పెత్తందారీ పోకడలపై దండయాత్ర చేస్తున్న సామాజిక ఉద్యమకారులు, కళలు, పాత్రికేయులు, పారిశ్రామిక దిగ్గజాలకు వరుసగా రెండో ఏడాది...ప్రభుత్వం తరపున ఈ అత్యున్నత అవార్డులను ప్రదానం చేస్తున్నామని సీఎం వెల్లడించారు. తమ శ్రమతో, స్వేదంతో రాష్ట్ర చరిత్రను గొప్పగా లిఖిస్తున్న రైతన్నలకు, మహిళా రక్షణకు నిరంతరం పాటుపడే రక్షణ సారథులకు, మన గడ్డమీద పుట్టి, వైద్య ఆరోగ్యరంగంలో మనిషి ప్రాణాలు నిలబెట్టడంలో అంతర్జాతీయ కీర్తి గడించిన మహామహులకు, మన పారిశ్రామిక దిగ్గజాలకు ఈ అవార్డులను ప్రతి సంవత్సరం నాన్న (వైఎస్ఆర్) పేరుమీద, ఒక మహానేత పేరు మీద ఇస్తున్నామని స్పష్టం చేశారు. సీఎంగా ఉన్న 5 ఏళ్ల 3 నెలల కాలంలో వైఎస్ఆర్ ఆచరించి చూపిన రైతు పక్షపాత, మహిళా పక్షపాత, నిరుపేద పక్షపాత విధానాలకు, సామాజిక న్యాయానికి, ప్రాంతీయ న్యాయానికి, వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవానికి, మనదైన తెలుగుదనానికి, మన కళలు, సాంప్రదాయాలకు, మన శ్రమకు, పరిశ్రమకు ఆయనను గుర్తు చేసుకుంటూ ఈ అవార్డులు ఇస్తున్నామన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డులు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ మరోసారి నాతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రజలందరి తరపున హృదయ పూర్వకంగా అభినందనలు చెబుతున్నానన్నారు.

వైసీపీ మోసం బట్టబయలు

మంత్రి ధర్మానకు రామకృష్ణ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ రాజధాని అంశంలో వైసీపీ మోసాన్ని బయటపెట్టిన మంత్రి ధర్మాన ప్రసాదరావును అభినందిస్తున్నామని, విశాఖ రాజధాని కావాలనే మంత్రులు, సీఎంకు ధైర్యముంటే రాజీనామాలు చేసి, రాజధాని అంశం రిఫరెండంగా ఎన్నికలకు వెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ...విశాఖనే ఏపీ రాజధానిగా ఉంటుందని రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారని గుర్తు చేశారు. వైసీపీ మోసాన్ని బయటపెట్టిన ధర్మానకు అభినందనలు తెలిపారు. దీనినిబట్టి మూడు రాజధానుల మాట బూటకమేనని అర్థమవుతోందని, కేవలం అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయాలనే కుట్రతో సీఎం జగన్ మూడు రాజధానుల అంశాన్ని లేవనెత్తారనీ, ప్రజల్లో గందరగోళం సృష్టించారనీ విమర్శించారు. అమరావతి కోసం రైతులు భూములు ఇచ్చారని, అమరావతి రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రూ.10 వేల కోట్లు వెచ్చించి చాలా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. విశాఖ ప్రాంతంలో వైసీపీ నేతలు భూ కుంభకోణాలకు పాల్పడ్డారని, ఆ భూముల విలువ పెంచుకునేందుకే విశాఖకు రాజధానిని తరలిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయని పేర్కొన్నారు. హైకోర్టు అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేయాలని ఆదేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసిందని తెలిపారు. అమరావతి ప్రాంత ధ్వంసమే జగన్ ధ్యేయంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని అభిప్రాయ పడ్డారు. ఇప్పటికైనా జగన్ మూడు రాజధానుల డ్రామాలు కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

విద్య, వైద్య, వ్యవసాయానికి పెద్దపీట

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం ఈ మూడు ప్రధాన రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలను పటిష్ఠంగా, పకడ్బందీగా అమలు చేస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విద్యాశాఖ ప్రగతిని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ, విద్యా సంస్కరణలతో పిల్లలకు, విద్యార్థులకు మంచి జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు.కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా 44,570 ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను కల్పిస్తూ విద్యాభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మనబడి నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూడు విడతలుగా అభివృద్ధి చేస్తున్నామని... ఇప్పటికే ఫేజ్-1 పనులు పూర్తికాగా ఫేజ్-2 పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇంగ్లీషు మీడియంపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, వారి పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారో చెప్పాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులతోనే మూడు, నాలుగు, అయిదు తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతుందన్నారు. 4067 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వబోతున్నామని వెల్లడించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాష్ట్రంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల పోస్టరును విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయ స్ఫూర్తికి, విద్యా వ్యాప్తికి, స్వాతంత్ర్య సాధనకు, ప్రజలలో ఐక్యతను పెంపొందించడానికి గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషించాయని అన్నారు.

జర్నలిస్టులపై వేధింపులు ఆపాలి

- 'ది వైర్'... ఎడిటర్ల నివాసాల్లో సోదాలు దురుద్దేశపూరితమైనవే
- ఖండించిన జర్నలిస్టు సంఘాలు, ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ: 'ది వైర్' కార్యాలయం, దాని సంపాదకులు ఇళ్లల్లో పోలీసులు సోదాలు నిర్వహించడాన్ని జర్నలిస్టు సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఖండించారు. సోమవారం ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు అనేక మంది ఢిల్లీ, ముంబైలోని వైర్ వ్యవస్థాపక సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, ఎం.కె.వేణు, సిద్ధార్థ భాటియా, డిప్యూటీ ఎడిటర్ జాహ్నవి సేన్, ప్రొడక్ట్-కమ్-బిజినెస్ ప్రధానాధికారి మిథున్ కిదాంబిలకు చెందిన నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా వారిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి జారీ చేసిన సెక్షన్ 91 నోటీసు ప్రకారం వివిధ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలోని భగత్ సింగ్ మార్కెట్‌లోని వైర్ కార్యాలయంలో కూడా సోదాలు జరిగాయి. అక్కడ ఉన్న అధికారులు ఒక న్యాయవాదిని భౌతికంగా బయటకు నెట్టి, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా సంస్థ మెటాలో 'ది వైర్'లో ప్రచురించిన వరుస కథనాలకు సంబంధించినది అమిత్ మాల్వియా ఫిర్యాదు. 'ది వైర్' ముందుగా కథనాలను ఉపసంహరించుకుంది. వాటిపై అంతర్గత సమీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. కాగా ఈ సోదాల పై జర్నలిస్టులు, వ్యక్తిగత వ్యాఖ్యాతలు సోషల్ మీడియాలో మాట్లాడారు. తమ ట్వీట్ల ద్వారా దాడులను ఖండించారు. 'ది వైర్'తో సహా 11 డిజిటల్ వార్తా సంస్థలను కలిగి ఉన్న గొడుగు గ్రూప్ డిజిపబ్ న్యూస్ ఇండియా ఫౌండేషన్ ఒక ప్రకటనను విడుదల చేసింది. పోలీసుల దాడులు దుర్మార్గపు ఉద్దేశాలతో కూడినవని పేర్కొంది. 'తప్పుడు నివేదికను ప్రచురించే జర్నలిస్టు లేదా మీడియా సంస్థ దాని సహచరులు, పౌర సమాజం ద్వారా జవాబుదారీగా ఉండాలి. అయితే అధికార పార్టీ అధికార ప్రతినిధి దాఖలు చేసిన పరువు నష్టంపై పూర్తిగా ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా మీడియా సంస్థల కార్యాలయం, దాని సంపాదకుల ఇళ్లలో పోలీసులు ఏకపక్షంగా సోదాలు చేయడం దుర్మార్గపు ఉద్దేశాలతో కూడినది' అని తెలిపింది. అంతేకాకుండా, 'ది వైర్' వద్ద ఉన్న రహస్య, సున్నితమైన వివరాలను స్వాధీనం చేసుకోవడానికి, నకిలీ చేయడానికి ఈ శోధనలు ఒక సాకుగా ఉపయోగించబడే ప్రమాదాన్ని తోసిపుచ్చలేము. నేర విచారణ, పోలీసుల వేధింపులు జర్నలిస్టులను తమ ఉద్యోగాలు చేయకుండా బెదిరింపులకు గురిచేశాయని ఇటీవలి అనేక సందర్భాలు చూపిస్తున్నాయని కూడా ఆ ప్రకటన పేర్కొంది. కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ ఆసియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ బెహ్ లిహ్ యి మాట్లాడుతూ 'ది వైర్' ఎడిటర్ల ఇళ్లపై దాడులు చేయడం భారత అధికారుల మితిమీరిన ప్రతిస్పందన అని అన్నారు. 'ది వైర్' స్వచ్ఛందంగా మెటా, అమిత్ మాల్వియా పై తన నివేదికను ఉపసంహరించుకుంది. దాని పాఠకులకు క్షమాపణ చెప్పింది. అంతర్గత సమీక్షను ప్రారంభించింది. వేధింపులు ఆపాలని అధికారు లను, రాజకీయ నాయకులను కోరుతున్నాం' అని సీపీజే పేర్కొంది. నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా ఇండియా దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సోదాలను 'అన్యాయమైనవి'గా తెలిపింది. సోషల్ మీడియాలో ఇతర వ్యాఖ్యాతలు కూడా ఈ సోదాలను ఖండించారు. 'నేర విచారణ పాత్రికేయ నీతి ఉల్లంఘనకు అసమానమైనది' ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ అపర్ గుప్తా పేర్కొన్నారు. మరికొందరు, వీరిలో ప్రతిపక్ష రాజకీయ నాయకులు, పాత్రికేయులు, పత్రికా స్వేచ్ఛపై గమనికలు చేశారు.

10 కోట్ల మందికి ఈపీఎఫ్ఓ భరోసా

కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్ర యాదవ్

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యత్తు నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా 10 కోట్ల మందికి భరోసా లభించనున్నట్లు కేంద్ర కార్మిక మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. ప్రస్తుతం 6.5 కోట్ల మందికి బీమా భద్రత ఉన్నట్లు చెప్పారు. ఈ పరిధి 10 కోట్లకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్ఓ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో యాదవ్ మాట్లాడారు. 'ఈపీఎఫ్ఓ సామాజిక భద్రతా పథకాల పరిధిని విస్తరిస్తున్నాం. ప్రస్తుతం 6.5 కోట్ల లబ్ధిదారులు ఉండగా ఇకపై 10 కోట్ల మందికి ప్రయోజనం ఉండనుంది' అని ఆయనన్నారు. ఈపీఎఫ్ఓ విజన్ 2047 పత్రాన్ని ఆవిష్కరించారు. కాలక్రమేణ ఈపీఎఫ్ఓ విస్తరణ హర్షణీయమని మంత్రి అన్నారు. ఈపీఎఫ్ విజన్ 2047లోని అంశాలు గుర్తించడం దేశంలో సామాజిక భద్రతను విశ్వవ్యాపితం చేసేందుకు దోహదమవుతుందని కార్మికశాఖ సహాయ మంత్రి రమేశ్వర్ తెలీ అన్నారు. కరోనా మహమ్మారి కాలంలో సంస్థ గణనీయమైన తోడ్పాటును అందించిందని ఐఎల్ఓ డైరెక్టర్ దగ్మార్ వాల్టర్ కొనియాడారు. సభ్యులకు నిరబాద్ సేవలను అందించిందన్నారు. 'ఈపీఎఫ్ఓ ఎట్ 70- ది జర్నీ' పేరిట నిర్వహించిన ప్రదర్శనశాల (ఎగ్జిబిషన్)ను మంత్రి ప్రారంభించారు. తపాలాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈపీఎఫ్ఓకు 70 ఏళ్లకు గుర్తుగా ప్రత్యేక కవర్‌ను ఆవిష్కరించారు. పూనేలో ప్రాంతీయ కార్యాలయం భవనానికి శంకుస్థాపన చేసిన ఆయన రాంచీలో ప్రాంతీయ కార్యాలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు.

బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్‌కు 'చిరు' అతిథ్యం

హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవిని భారత్‌లో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రిటన్, భారత్‌కు సంబంధించిన వివిధ అంశాలను ఈ సందర్భంగా ఇద్దరూ చర్చించుకున్నారు. ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలతో బ్రిటన్‌కు ఉన్న అనుబంధం గురించి మాట్లాడుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను మెగాస్టార్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. 'బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్‌ను కలవడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయనకు విందు ఏర్పాటు చేసి.. మన తెలుగు వంటకాలను రుచి చూపించా... నోరూరించే ఆవకాయను కూడా ఆయన రుచి చూశారు' అని చిరంజీవి వెల్లడించారు.

కారు ప్రమాదానికి గురైన ప్రముఖ నటి రంభ

హైదరాబాద్: కెనడాలో ఉంటున్న ప్రముఖ సినీ హీరోయిన్ రంభ కారు ప్రమాదానికి గురై స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రస్తుతం రంభ కుటుంబం కెనడాలో ఉంటోంది. అక్కడి కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం రంభ తన పిల్లలను స్కూల్ నుంచి తీసుకుని వస్తుండగా వీరి కారును మరో వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తామంతా స్వల్ప గాయాలతో బయటపడినట్లు రంభ స్పష్టం చేసింది. అయితే ఆమె చిన్న కుమార్తె సాషా మాత్రం గాయాల కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని పేర్కొంది. ప్రమాద సమయంలో కారులో రంభ, ఆమె పిల్లలతో పాటు ఓ ఆయా కూడా

ఉన్నారు. కారులో సమయానికి ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. రంభకు యాక్సిడెంట్ అని సోషల్ మీడియాలో అభిమానులకు తెలియగానే ఆందోళనకు గురయ్యారు. ఆమె కుమార్తె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న రంభ.. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్ ను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఆమె అక్కడే తన కుటుంబంతో ఉంటోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరి కుటుంబం కెనడాలో ఒంటారియోలో నివాసముంటోంది. తెలుగుతో పాటు అనేక తమిళ, మలయాళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించిన రంభ... 90వ దశకంలో తన నటనతో చెరగని ముద్ర వేశారు.

'మిలీ' ఇబ్బంది పెట్టింది: జాన్వీ

ముంబై: 'మిలీ' చిత్రం కోసం శారీరకంగానే కాక మానసికంగా కూడా చాలా ఇబ్బంది పడ్డానని బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తెలిపింది. కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా కొత్త బాటలో పయనిస్తూ బాలీవుడ్‌లో మంచి అవకాశాలను దక్కించుకుంటోన్న ఈ భామ నటించిన తాజా చిత్రం 'మిలీ'... నవంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మిలీ చిత్రం కోసం తాను ఎంత కష్టపడ్డానో తెలిపింది. "ఈ సినిమా కోసం శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా చాలా ఇబ్బంది పడ్డా. ఈ చిత్రంలో నేను మిలీ నౌదియల్‌గా కనిపిస్తా. దర్శకుడి సూచన మేరకు పాత్రకు సెట్ అయ్యేలా 7 కేజీలకు పైగా బరువు పెరిగా. అయితే, షూటింగ్ సమయంలో నేను పోషించిన పాత్రకు సంబంధించిన దృశ్యాలు రాత్రిపూట కలలోకి వచ్చేవి. సరిగా నిద్రకూడా పట్టేది కాదు. దీంతో ఆరోగ్యం దెబ్బతింది. రెండు, మూడు రోజులు పెయిన్ కిల్లర్ వాడా. రోజులో 15 గంటలు ఫ్రీజర్‌లో ఉండాల్సి వస్తే, అక్కడ ఓ ఎలుక మీ వేలిని కొరుకుతుంటే ఎలా ఉంటుంది. కష్టంగా ఉంది కదూ. అలాంటి నేపథ్యంలోనే ఈ చిత్రం తెరకెక్కింది. ఇది మంచి సినిమా, విజయం సాధిస్తుందనే నమ్మకం నాకు ఉంది' అని చెప్పుకొచ్చారు. అనుకోని పరిస్థితుల్లో మైనస్ 18 డిగ్రీల గడ్డకట్టుకుపోయే చలిలో ఇరుక్కుపోయిన మిలీ అనే యువతి ఆ ప్రమాదం నుంచి ఎలా బయటపడింది అనే ఆసక్తికర కథాంశంతో తెరకెక్కింది ఈ చిత్రం. మలయాళ చిత్రం 'హెలెన్'కు రీమేక్‌గా ఈ చిత్రాన్ని బోనీ కపూర్ నిర్మించారు. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సన్నీ కౌశల్, మనోజ్ పవా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

కివీస్ జోరుకు కళ్లెం... ఇంగ్లండ్‌కు రెండో గెలుపు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌కు తొలి ఓటమి ఎదురైంది. సూపర్-12 దశలో భాగంగా మంగళవారం బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో ఇంగ్లండ్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 20 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది. ఈ గ్రూప్-1 మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్... నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. అనంతరం 180 పరుగుల లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులే చేయగలిగింది. ఓ దశలో గ్లెన్ ఫిలిప్స్ (62), కేన్ విలియమ్సన్ (40) ఊపు చూస్తే కివీస్ సునాయాసంగా గెలిచేలా కనిపించింది. అయితే, వీరిద్దరూ అవుటయ్యాక ఇంగ్లండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో న్యూజిలాండ్ సాధించాల్సిన రన్ రేట్ పెరిగిపోయింది. టాపార్డర్ మొత్తం పెవిలియన్‌కు చేరడంతో మిచెల్ శాంట్నర్ (16 నాటౌట్), ఇష్ సోధీ (6 నాటౌట్) వంటి బ్యాటర్లు భారీ షాట్లు కొట్టలేకపోయారు. జేమ్స్ నీషామ్ (6), డారిల్ మిచెల్ (3) విఫలం కావడం కివీస్ అవకాశాలపై ప్రభావం చూపింది. అంతకుముందు, న్యూజిలాండ్ కు ఓపెనర్లు ఫిన్ అలెన్ (16), డెవాన్ కాన్వే (3) పేలవ ఆరంభాన్నిచ్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 2, శామ్ కరన్ 2, మార్క్ ఉడ్ 1, బెన్ స్టోక్స్ 1 వికెట్ తీసి జట్టు విజయంలో తమవంతు పాత్ర పోషించారు.

బట్లర్, హేల్స్ అర్ధ సెంచరీలు

తొలుత ఇంగ్లండ్ ఓపెనర్లు జోస్ బట్లర్, అలెక్స్ హేల్స్ అర్ధసెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ బట్లర్ 47 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 73 పరుగులు చేయగా, హేల్స్ 40 బంతుల్లో 52 పరుగులు సాధించాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత లియామ్ లివింగ్ స్టోన్ ఒక్కడే ఫరవాలేదనిపించాడు. లివింగ్ స్టోన్ 14 బంతుల్లో 20 పరుగులు చేశాడు.

మొయిన్ అలీ (5), బెన్ స్టోక్స్ (8), హ్యారీ బ్రూక్ (7) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గుసన్ 2, టిమ్ సౌథీ 1, మిచెల్ శాంట్నర్ 1, ఇష్ సోధీ 1 వికెట్ తీశారు. ఈ విజయంతో ఇంగ్లండ్ గ్రూప్-1 పాయింట్ల పట్టికలో రెండోస్థానానికి చేరింది. ఇంగ్లండ్ ఇప్పటిదాకా 4 మ్యాచ్ లు ఆడి రెండు విజయాలు సాధించింది. ఈ గ్రూప్ లో న్యూజిలాండ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

లంక సెమీస్ ఆశలు సజీవం

బ్రిస్బేన్: టీ20 ప్రపంచ కప్ లో శ్రీలంక కీలక విజయం సాధించి సెమీఫైనల్ ఆశలు సజీవం చేసుకుంది. నాలుగు మ్యాచ్ ల్లో గెలుపు రుచి చూడని అఫ్ఘనిస్తాన్ సెమీస్ రేసు నుంచి వైదొలిగింది. సూపర్ 12 గ్రూప్-1లో భాగంగా మంగళవారం ఉదయం బ్రిస్బేన్ లో జరిగిన మ్యాచ్ లో శ్రీలంక 6 వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్ ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగుల గౌరవపద స్కోరు చేసింది. రహ్మనుల్లా గుర్బాజ్ (28), ఉస్మాన్ ఘని (27), ఇబ్రహీం జద్రాన్ (22) రాణించారు. శ్రీలంక బౌలర్లలో స్పిన్నర్ వానిందు హసరంగ మూడు వికెట్లతో సత్తా చాటగా, లాహిరు కుమార రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 145 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 18.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసి అలవోకగా గెలిచింది. ధనంజయ డిసిల్వా (66 నాటౌట్) అర్ధ శతకంతో లంకకు విజయం అందించాడు. కుశాల్ మెండిస్ (25) కూడా రాణించాడు. నాలుగు మ్యాచ్ లలో రెండు విజయాలు, రెండు ఓటములతో శ్రీలంక నాలుగు పాయింట్లతో గ్రూప్-1లో మూడో స్థానంలో ఉంది. నాలుగు మ్యాచ్ లలో రెండింటిలో ఓడిన అఫ్గాన్ జట్టు... రెండు మ్యాచ్ లు రద్దవడం ద్వారా రెండు పాయింట్లు సాధించింది. పట్టికలో చివరి స్థానంలో ఉన్న ఆ జట్టు సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకుంది.

ఆరంభమే టీమిండియాకు సమస్య

నేడు బంగ్లాతో మ్యాచ్

అడిలైడ్: టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా టీమిండియా బంగ్లాదేశ్ జట్టుతో తలపడ నుంది. పాకిస్తాన్, నెదర్లాండ్స్‌పై నెగ్గి దక్షిణాఫ్రికా చేతిలో ఓడిన భారత జట్టు...గ్రూప్-2 పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. అడిలైడ్ వేదికగా బుధవారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఓపెనర్ కేఎల్ రాహుల్ విఫలమవడం టీమిండియాను కలవరపెడుతోం ది. మూడు మ్యాచ్‌ల్లో కలిపి రాహుల్ 22 పరుగులే చేశాడు. పాకిస్తాన్, దక్షిణాఫ్రికా వంటి పటిష్ఠమైన బౌలింగ్ దాడిని ఎదుర్కొనేం దుకు రాహుల్ తడబడ్డాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో రాహుల్ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుం టుందో చూడాలి. ప్రస్తుతం టోర్నీలో సూర్య కుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ రాణిస్తుం డగా, కెప్టెన్ రోహిత్ నెదర్లాండ్స్‌పై మాత్రం అర్ధ సెంచరీ చేశాడు. ఇక వికెట్ కీపర్ దినేష్ కార్తీక్ వెన్నునొప్పితో బాధపడుతుండటంతో అతని స్థానంలో రిషభ్ పంత్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇక బంగ్లాదేశ్ బ్యాటింగ్ లైనప్‌లో కెప్టెన్ షకీబ్ అల్ హసన్ సహా నలుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉండటంతో స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను జట్టులో కొనసాగిస్తారా లేదా అతని స్థానంలో అక్షర్ పటేల్‌ను ఆడిస్తారా వేచి చూడాలి. పేసర్లు భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ రాణిస్తుం డటం టీమిండియాకు కలిసివచ్చే అంశం. మరోవైపు ఈ టోర్నీలో చిన్న జట్లతో ఆడిన రెండు మ్యాచుల్లోనూ బంగ్లాదేశ్ చెమటోడ్చి నెగ్గింది.

జింబాబ్వేతో ఉత్కంఠభరిత పోరులో నెగ్గిన బంగ్లాదేశ్... నెదర్లాండ్స్‌పై కూడా విజయం కోసం శ్రమించాల్సి వచ్చింది. ఎదుర్కొన్నవి చిన్నజట్లే అయినా బంగ్లా బ్యాటర్లు మాత్రం పెద్దగా స్కోర్లు చేయలేదు. ఓపెనర్ నజ్ముల్ హుస్సేన్ శాంటో మాత్రమే రెండు మ్యాచ్లో కలిపి 100కిపైగా పరుగులు చేశాడు. టీమిండియా బౌలింగ్ దాడిని వీరు ఎలా ఎదుర్కొంటారో చూడాలి. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచే జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. అడిలైడ్ పిచ్ ఆరంభంలో పేసర్లకు సహకరిస్తుం డటమే అందుకు కారణం. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒకటిన్నరకు మ్యాచ్ ప్రారంభంకానుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.